ప్రజాశక్తి

శనివారం 26 అక్టోబర్ 2024   8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



సూర్యలంక బీచ్

బీచ్‌కెళ్తే బాదుడే.!

- సూర్యలంకకు వెళ్లాలంటే మనిషికి రూ.20 చొప్పున ఫీజు
- వాహన పార్కింగ్‌కు అదనం
- జనవరి 1 నుంచి అమలు చేయనున్న యంత్రాంగం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

సెలవు రోజుల్లో ఆహ్లాదంగా గడిపేందు కోసం సముద్రతీరానికి వస్తున్న పర్యాటకుల జేబుకు చిల్లు పెట్టేందుకు పాలకులు, అధికారులు సన్నద్ధమవుతున్నారు. బీచ్‌ల అభివృద్ధి పేరుతో పర్యాటకుల నుంచి ఫీజులు వసూలు చేయనున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సూర్యలంక బీచ్‌కు వెళ్లే ప్రతి ఒక్కరి దగ్గరా రూ.20 వసూలు చేసేందుకు సిద్ధమయ్యారు. జనవరి 1 నుంచి ఈ మొత్తాన్నీ వసూలు చేసేందుకు నిర్ణయించుకున్నారు.

సముద్రతీరంలో ఉన్న గ్రామ పంచాయతీ అభివృద్ధికి, అక్కడి సిబ్బంది జీతాలకు పర్యాటకుల నుంచి ఫీజులు వసూలు చేయడమే మార్గం అన్నట్లుగా నిర్ణయాలు చేస్తున్నారు. ఇటీవలనే చీరాల వాడరేవు వద్ద వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంలో టోల్‌గేట్‌ను ఏర్పాటు చేశారు. నిమజ్జనం సందర్భంగా వచ్చే వాహనాల ద్వారా పంచాయతీకి రాబడి వస్తుందని టోల్ గేట్ పెడుతున్నట్లు చెప్పారు. టోల్‌ఫీజు వసూలు కోసం అదనంగా సిబ్బందిని తీసుకున్నారు. ఇప్పటికీ సదరు టోల్‌గేట్ కొనసాగుతోంది. వేటపాలెం వద్ద రామాపురం బీచ్ రోడ్‌లో కూడా టోల్‌గేట్ పెట్టాలన్న ఆలోచనలో తెలుగు తమ్ముళ్ల ఉన్నారు.

కార్తీకమాసం సందర్భంగా బాపట్ల సూర్య లంక బీచ్‌లో చేపట్టాల్సిన పనుల ఏర్పాట్ల విష యమై బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మరాజు అధికారులతో శుక్రవారం సమావేశమయ్యారు. సూర్యలంక బీచ్ అభివృద్ధి కోసం ఇక్కడికి వచ్చే ▶ 3లో

ఎట్టకేలకు 'వెలిగొండ'పై దృష్టి



- ఎట్టకేలకు 'వెలిగొండ'పై నేతల దృష్టి
- 29న ప్రాజెక్టును సందర్శించనున్న మంత్రులు
- ప్యాకేజీల కోసం ఎదురుచూస్తున్న నిర్వాసితులు
- పర్యటనపై జిల్లా మంత్రి స్వామితో చర్చించిన ఇరిగేషన్ మంత్రి

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

కూటమి అధికారంలోకి వచ్చాక అందరూ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి మొదలు అందరూ వెలిగొండపైనే మాట్లా డారు. మరో మంత్రి గొట్టిపాటి రవికుమార్ కూడా కనిగిరి నియోజకవర్గ పర్యటనలోనూ వెలిగొండపైనే ప్రధానంగా మాట్లాడారు. అందరినోటా వెలుగొండ పూర్తిచేస్తామనే వినిపించింది. అయితే ఇప్పటివరకూ దానివైపు కన్నెత్తి చూడటానికి కూడా సాహసించలేక పోయారు. ఎందుకంటే కోట్లాది రూపాయల నిధులు మంజూరు కావాల్సి ఉంది. నిర్వాసితు లకు సమాధానం చెప్పాల్సి ఉంది. దీంతో మంత్రులు ఇద్దరూ వెలుగొండపై హామీలు ఇస్తున్నారే తప్ప దాని తదుపరి కార్యాచరణపై కేంద్రీకరించలేకపోయారు.

నాలుగు రోజుల క్రితం వెలుగొండ ప్రాజెక్టుపై ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామా నాయుడు జిల్లా మంత్రి డోలా వీరాంజనేయ స్వామితో చర్చించారు. ప్రాజెక్టు సందర్శనకు వస్తామని చెప్పారు. వాస్తవానికి ఇరిగేషన్ మంత్రి నెల 24వ తేదీనే రావాలని భావించారు. అందరూ అందుబాటులో లేక పోవడంతో పాటు ఇతర మంత్రులు, ఎమ్మె ల్యేలు అందరితో చర్చించాల్సి ఉన్నందున ఆ తేదీ ఖరారు కాలేదు. తాజాగా మంత్రి గొట్టి పాటి రవికుమార్ గురువారం నాడు విజయ వాడలోని తన క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి ప్రకాశం ఎమ్మెల్యేలతో భేటీ నిర్వహించారు. మంత్రి డోలాతో పాటు అందరూ హాజర య్యారు. ఈ సమావేశంలో జిల్లాలోని కొన్ని అంశాలతో పాటు ప్రధానంగా వెలిగొండ ప్రాజెక్టుపైనా చర్చించారు. ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు వెలుగొండను సందర్శించాలని నిర్ణయించిన విషయాన్ని మంత్రి డోలా సమావేశంలో నేతల మధ్య చర్చ పెట్టారు. దీంతో మం త్రులు ఇద్దరూ, మిగతా ఎమ్మెల్యేలు అందరూ కలిసి ఈ నెల 29న ప్రాజెక్టు సందర్శన ఖరారు చేశారు. ఎట్టకేలకు జిల్లా నేతలు అందరూ కలిసి వెలిగొండను సందర్శించను న్నారు. దానిపై భవిష్యత్ కార్యా చరణను ఖరారు చేయనున్నారు. ఇరిగేషన్ మంత్రి వస్తున్నందున అన్నీ ఆయనతోనే ముడిపడి ఉన్నాయి. ప్రాజెక్టులో మిగిలిన పనులతో పాటు నిర్వాసితులకు ప్యాకేజీల కోసం భారీగా నిధులు అవసరం ఉన్నందున ఈ వ్యవహారం సిఎం చంద్రబాబు స్థాయికి వెళ్లాల్సి ఉంది. అందుకే మంత్రులు ప్రాజెక్టును సందర్శించి మిగిలిన పనులను చూస్తారు. నిర్వాసితుల అవసరాలూ చర్చి స్తారు. అన్నిం టిపై సిఎం చంద్రబాబుకు నివే దిక ఇచ్చాకే దాని భవితవ్యం ఏమిటన్నది తేలనుంది. వాస్తవానికి నిర్వాసితులకు ప్యాకే జీలు ఇవ్వ లేదు. వన్‌టైం సెటిల్‌మెంటు కింద ఒక్కొక్కరికి రూ.12.50 లక్షలు ఖరారు చేశారు. డబ్బులు మాత్రం ఇవ్వలేదు. దీంతో 7 వేల మంది నిర్వాసితులు ముంపు గ్రామాల్లోనే ఉన్నారు. వీరికి ప్యాకేజీల కోసం రూ.వెయ్యి కోట్లకు పైగానే కావాల్సి ఉంది. జాబితాలు ఇప్పటికే తయారుచేశారు. ప్రభుత్వం ▶ 2లో



మాట్లాడుతున్న దామచర్ల జనార్ధన్

టిడిపి సభ్యత్వంతో కుటుంబానికే భరోసా

- ప్రమాద బీమా రూ.5 లక్షలకు పెంపు
- ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల

2లో ▲

నిరాడంబర 'స్వామి'.!

ఈ పక్క ఫొటో విజయవాడ రైల్వేస్టేషన్‌లోది.. రైల్వేస్టేషన్‌లో సాధారణ వ్యక్తిలా అరుగు మీద కూర్చున్న వ్యక్తిని గుర్తుపట్టారా.? మన జిల్లా మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి.. ఆయన రాష్ట్ర మంత్రి అయినా అరుగుపై సామాన్యుడిలా రైలు కోసం వేచి ఉండటం ఆయన నిరాడంబరతకు నిదర్శనం.. ఎదిగేకొద్దీ ఒదిగి ఉండాలనే పెద్దల మాటను ఆచరిస్తూ..ముందుకెళుతున్నారు.

- ప్రజాశక్తి, ఒంగోలు



అమాయకులను రక్షించి..

కుట్రను ఛేదించి..



మాట్లాడుతున్న ఎస్‌పి దామోదర్

- చాకచక్యంగా అసలు ముద్దాయిలను పట్టుకున్న పొదిలి పోలీసులు
- హత్యాయత్నం చేసి.. తప్పించుకొనేందుకు ప్రయత్నించిన నిందితులు
- ఎస్‌పి దామోదర్ వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో వివాదాలు, కక్షల కారణంగా కిరాయి హంతకులతో ఓ వ్యక్తిపై హత్యాయత్నం చేయించిన నింది తులు.. తాము తప్పించుకొనేందుకు అమా యకులకు డబ్బు ఎర చూపి..బలి చేయాలను కున్నారు. పొదిలి పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి.. సమగ్ర దర్యాప్తు చేసి.. అసలైన నిందితులను కనుక్కొని.. అరెస్టు చేశారు. అమాయకులు ఈ కేసులో ఇరుక్కోకుండా కాపాడారు. కేసు వివరాలను పొదిలి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమా వేశంలో ఎస్‌పి దామోదర్ వెల్లడించారు.

పొదిలి పట్టణానికి చెం దిన పోల్ల రమేష్, పెమ్మని ఓంకార్ ఇద్దరూ కలిసి గతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారు. ఆ సమయంలో వారిద్దరి మధ్య మనస్పర్ధలు రావడంతో ఎవరికి వారు విడివిడిగా వ్యాపారం చేసుకుంటున్నారు. ఆ తరువాత రమేష్ దొండ్లేటి రామిరెడ్డితో కలిసి ▶ 2లో

బాణాసంచా దుకాణాలకు

అనుమతి తప్పనిసరి

- నిర్వాహకులు నిబంధనలు పాటించకుంటే కఠినచర్యలు
- ఎస్పీ తుషార్ డూడి



ఎస్పీ తుషార్ డూడి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

దీపావళి బాణసంచా తయారీ కేం ద్రాలు, నిల్వ చేసే గోడౌన్స్, విక్రయించే దుకాణాలకు తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి ఉండాలని, ప్రభుత్వం సూచించిన నిబంధన లను పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తుషార్‌డూడి హెచ్చ రించారు. రాబోయే దీపావళి పండుగను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా తీసుకోవలసిన ముందస్తు చర్యల గురించి శుక్రవారం జిల్లా ఎస్పీ పోలీస్ అధికారు లకు దిశానిర్దేశం చేశారు. విక్రయదారులు, గోడౌన్స్, తయారీ కేంద్రాల యజమా నులు పాటించవలసిన నిబం ధనల గురించి వివరించారు.

గతంలో వివిధ ప్రదేశాలలో జరిగిన ప్రమాదాలను దష్టిలో ఉంచుకొని ప్రజల శ్రేయస్సును ఉద్దేశించి బాణాసంచా తయారీ కేంద్రాలకు, నిల్వ చేసే గోడౌన్లకు, విక్రయించే దుకాణాలకు పలు నియమ నిబంధనలు సూచించడం జరిగిందని ఎస్పీ తెలిపారు. బాణాసంచా ▶ 2లో

అమాయకులను రక్షించి..కుట్రను ఛేదించి..

(మొదటిపేజీ తరువాయి)

వ్యాపారం చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో రమేష్, ఓంకార్ కలిసి ఉన్న సమయంలో పొదిలి మండలం, పోతవరం గ్రామంలో రమేష్ కొంతమంది వద్ద అప్పులు చేశాడు. ఓంకార్ మధ్యవర్తిగా ఉండి డబ్బులు ఇప్పించాడు. వారిద్దరూ విడిపోయిన తర్వాత పోతవరం గ్రామస్తులు రమేష్ మీద వారిచ్చిన డబ్బులు గురించి కోర్టులో కేసులు వేశారు. ఓంకార్ వారితో కోర్టులో కేసులు వేయించినట్లుగా భావించి అతని మీద రమేష్ ఎక్కువగా కక్ష పెంచు కున్నాడు. అదేకాక రమేష్ మరియు ఓంకార్‌లు ఇద్దరూ ఒకరి మీద మరొకరు దుష్ప్ర చారాలు చేసుకోవడం వల్ల రమేష్ మరియు రామిరెడ్డి కలిసి కొంటున్న పొలాలకు సంబంధించి సదరు ల్యాండ్ ఓనర్స్ వీరిని నమ్మలేదు. దీంతో రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో రమేష్, రామిరెడ్డిలకు భారీగా నష్టం వచ్చింది. చేస్తున్న ప్రతి పనికీ ఓంకార్ అడ్డం వస్తున్నాడని వారు భావించి, ఓంకార్‌ను అంతమొందిస్తే గానీ వారు వ్యాపారరీత్యా ముందుకు వెళ్లలేరని భావించారు. ఎలాగైనా సరే ఓంకార్‌ను చంపా లని ఉద్దేశంతో.. వారు చేస్తే దొరికిపోతామని, అందుకు అనుగుణంగా ఎవరైనా కొంతమంది వ్యక్తులను డబ్బులిచ్చి మాట్లాడాలని రమేష్, రామిరెడ్డి అనుకున్నారు. ఆ క్రమంలో రమేష్‌కు ఇట్లా భాస్కరరావు అను గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ పరిచయమయ్యారు. రమేష్ అతనితో కొంత కాలం స్నేహంగా ఉంటూ, అతనికి భారీ మొత్తంలో డబ్బులు ఆశ చూపించారు. దర్శి మండలంలో అతని మూడు ఎకరాల పొలం ఆన్లైన్ చేయించి అది వేరే వారికి రిజిస్టర్ చేయించుకునే విధంగా రెవెన్యూ వారితో మాట్లాడి అతని పని చేయిస్తానని, రమేష్ భాస్కర్‌రావుకు ఆశ చూపించారు. అతన్ని నేరం చేయటానికి ఒప్పించాడు. అంతట భాస్కరరావు అతని మేనల్లుడు అయిన కంభం మండలం, రావిపాడు గ్రామానికి చెందిన సిసింద్రీ ఉరఫ్ శశికి విషయం మొత్తం చెప్పి అతని ద్వారా శశికి తెలిసిన మరో ఇద్దరు నాయబ్‌రసూల్ మరియు బాల శివప్రసాద్‌లను సమకూర్చుకున్నారు. ఈ నలుగురు కలిసి పలుమార్లు ఓంకార్‌ను చంపటానికి ప్రయత్నం చేసినప్పటికీ విఫలమయ్యారు. అక్టోబర్ ఐదున రాత్రి 10.50 గంటలకు ఓంకార్ ఇంటికి వెళుతుండగా పై నలుగురు ముద్దాయిలు ఒక పథకం ప్రకారం ఇనుపరాడ్లతో విచక్షణా రహితంగా ఓంకార్ తల మీద మరియు ఒంటిమీద కొట్టగా అతను స్పృహతప్పి పడిపోయాడు. ఓంకార్ చనిపోయాడని అక్కడి నుండి వెళ్లిపోయారు. ఇందుకు గానూ రమేష్ భాస్కరరావుకు రూ.8 లక్షలు నగదు ఇవ్వడానికి ఒప్పుకొనగా.. భాస్కర్‌రావు అతను ఏర్పాటు చేసుకున్న కిరాయి నిందితులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయలు ఇస్తానని చెప్పి వారిని నేరం చేయడానికి ఒప్పించారు. ఆ తదుపరి రమేష్, రామిరెడ్డి మరియు పై నలుగురు ముద్దాయిలు తప్పించుకొనుటకు ఒక కుట్రపూరితంగా పథకం పన్నారు. తాను పోలీసు వారితో మాట్లాడానని ఎవరైనా నలుగురు వ్యక్తులు వారు చేసిన నేరము తాము చేసినట్లుగా ఒప్పుకొని పోలీసుస్టేషన్‌లో లొంగిపోతే వారికి ఒక్కొక్కరికి లక్ష రూపాయలు డబ్బులు ఇస్తానని, తాను పోలీస్ వారితో మాట్లాడానని, ఎటువంటి ఇబ్బంది లేదని చెప్పి.. రమేష్ ఓ నలుగురిని పోలీసుల ముందుకు పంపారు. అమాయకులైన ఆ నలుగురు డబ్బుకు ఆశ పడి పోలీసుల ముందు ఈ నేరం తామే చేశామని పోలీస్ స్టేషన్‌కు వచ్చి చెప్పారు. పొదిలి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు వారి మాటలను నమ్మలేదు. వారిని కోర్టుకు పంపకుండా, నిజాయతీగా విచారణ చేసి అసలయిన నేరస్తులు వారు కాదని తేల్చారు. సమగ్ర దర్యాప్తు చేసి, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి అసలైన కిరాయి హంతకులను ఈ నెల 25న తేదీన పొదిలిలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్ వద్ద అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి రెండు బైకులు, రూ.40,500 నగదు, నాలుగు ఐరన్ రాడ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారి అయిన రమేష్ పరారీలో వున్నాడు. త్వరితగతిన అతడిని కూడా పట్టుకుంటామని ఎస్‌పి తెలిపారు. అమాయకులను రక్షించి అసలైన కిరాయి హంతకులను పట్టుకున్న దర్శి డిఎస్పి లక్ష్మీనారాయణ, పొదిలి సీఐ వెంకటేశ్వర్లు, పొదిలి ఎస్ఐ వేమన మరియు సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

టిడిపి సభ్యత్వంతో కుటుంబానికే భరోసా

ప్రమాద బీమా రూ.5 లక్షలకు పెంపు • ప్రజల్లో అవగాహన కల్పించాలి • ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కేవలం గుర్తింపు మాత్రమే కాదని, ఒక కుటుంబానికే భరోసా వంటిదని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఎన్టీఆర్ భవన్‌లో టిడిపి సభ్యత్వ నమోదుపై నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో నియోజక వర్గ క్లస్టర్/యూనిట్ /బూత్ ఇన్‌చార్జులు, ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా ఒంగోలు ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ శ్రేణులకు సభ్యత్వ నమోదుపై దిశా నిర్దేశం చేశారు. తెలుగుదేశం పార్టీలో రూ.100తో సభ్యత్వం తీసుకుంటే రెండేళ్ల పాటు 2 లక్షల వరకు ప్రమాదబీమా సౌకర్యం ఉండేదని, ఇప్పుడు దానిని రూ.5 లక్షల వరకు పొడిగించారని అన్నారు. కుటుంబ పెద్దకు దురదృష్టవశాత్తు ఏదైనా ప్రమాదం జరిగితే వారి పిల్లల చదువులు, ఉద్యోగాలు ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా అందిస్తుందన్నారు. లక్ష రూపాయలు చెల్లిస్తే శాశ్వత సభ్యత్వం ఉంటుందన్నారు. దేశంలో ఏ పార్టీకి లేని విధంగా కార్యకర్తలకు, పార్టీని నమ్మినవారికి అండగా ఉండే విధంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, నారా లోకేష్ చొరవ తీసుకున్నారన్నారు. పార్టీలో ఏవైనా పదవులు కావాలన్నా.. లేదా ఇతర అంశాల్లో ప్రాధాన్యత ఉండాలన్నా సభ్యత్వ నమోదు తప్పనిసరిని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాన్ని వంద శాతం సాధించాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు కోరారు. సమావేశంలో టిడిపి జిల్లా నాయకులు మంత్రి శ్రీనివాసరావు, వైవి సుబ్బారావు, రాచగర్ల వెంకట్రావు, వై శశికాంత్ భూషణ్, కొమ్మూరి రవిచంద్ర, షేక్ కఫీల్ బాషా, తాతా ప్రసాద్, కొఠారి నాగేశ్వరరావు, దాయనేని ధర్మ, తాతా ప్రసాద్, వేమూరి మాల్యాద్రి, బేతంశెట్టి హరిబాబు, అంబటి ప్రసాదరావు, పెద్దిశెట్టి చంద్ర, మహిళా నాయకురాళ్లు రావుల పద్మజ, కె కుసుమకుమారి, నాళం నరసమ్మ, ఆర్ల వెంకటరత్నం, మండువ లావణ్య, నిడమానూరి పావని, తెలుగునాడు, అంగన్‌వాడీ, డ్వాక్రా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దిశెట్టి వరలక్ష్మి, యు నాగేంద్రమ్మ, బి అరుణారెడ్డి, గోన మేరీ రత్నకుమారి, నియోజకవర్గ క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాణాసంచా దుకాణాలకు అనుమతి తప్పనిసరి

(మొదటిపేజీ తరువాయి)

నిల్వచేసే గూడెం నిర్వాహకులు, తయారీ, విక్రయాలు చేసే వారు తప్పనిసరిగా సంబంధిత అధికారుల నుండి అనుమతులు పొందాలన్నారు. నివాస ప్రాంతాలకు నిర్దిష్ట దూరంలో ఉండాలని చెప్పారు. అగ్నిప్రమాదాలు చోటు చేసుకోకుండా తగిన భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఆ ప్రదేశాలలో ప్రమాదం జరగడానికి అవకాశం వుండే సిగరెట్లు తాగడం వంటి చర్యలు చెయ్యరాదని చెప్పారు. మండే స్వభావం వున్న పెట్రోల్, అగ్గి పెట్టెలు ఇతర వస్తువులు అనుమతించరాదన్నారు. విధులు నిర్వహించే సిబ్బందికి అగ్ని ప్రమాదం సంభవిస్తే తీసుకోవలసిన చర్యలపై అవగాహన ఉండాలన్నారు. బాణాసంచా విక్రయ దుకాణాలు అధికారులు సూచించిన ప్రదేశాలలోనే ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. జనావాసాలకు, విద్యాసంస్థలకు, వైద్యశాలలకు దూరంగా బాణాసంచా విక్రయాలు జరగాలన్నారు. బాణాసంచా విక్రయ దుకాణాల మధ్య నిర్దిష్ట దూరం ఉండే విధంగా ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ప్రతి దుకాణం వద్ద రెండు అగ్నినిరోధక సిలిండర్లు, రెండు బకెట్ల పొడి ఇసుక, నీరు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. జిల్లాలో బాణసంచా తయారీ, విక్రయాలు చేసేవారు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండి.. ప్రభుత్వ నియమ నిబంధలకు లోబడి బాణసంచా విక్రయించాలన్నారు. లైసెన్సులు లేకుండా ఎవరైనా మందుగుండు సామగ్రి తయారుచేసినా, నిల్వ చేసినా, విక్రయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ అధికారులు వారి పరిధిలోని బాణాసంచా తయారీ కేంద్రాలను, విక్రయ దుకాణాలను, నిల్వ ఉంచిన గోడౌన్‌లను సందర్శించి లైసెన్స్‌లు తనిఖీ చేయాలన్నారు. భద్రతా ప్రమాణాలు ప్రభుత్వ నిబంధనల అనుగుణంగా ఉన్నాయా.. లేదా.. పరిశీలించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను పాటించని వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు. జిల్లాలో ఎక్కడైనా బాణసంచా సామగ్రి అక్రమ విక్రయాలు, నిల్వలకు సంబంధించిన సమాచారం ఉంటే డయల్ 100, 112 నెంబర్ లకు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ తెలిపారు.

ఎట్టకేలకు 'వెలిగొండ'పై దృష్టి

(మొదటిపేజీ తరువాయి)

మారినందున మళ్లీ జాబితాలు సిద్ధం చేయాలని కోరే అవకాశం ఉందని సమాచారం. గ్రామాల్లో నిర్వాసితులు కూడా ప్యాకేజీలు ఇస్తే అక్కడ నుంచి ఖాళీ చేసి వెళ్లాలనే ఆలోచనలో ఉన్నారు. ఎందుకంటే గ్రామాల్లో కనీస సౌకర్యాలు కూడా లేవు. ఊళ్లన్నీ శిథిలావస్థకు చేరాయి. ఎటూ ఖాళీ చేస్తున్నందున అక్కడ ఏ సౌకర్యాలూ మెరుగుపరచలేదు. ముంపునకు గురయ్యే పొలాలను సాగుచేసుకుంటూ జీనం సాగిస్తున్నారు. పెద్దసంఖ్యలో పశువులు కూడా ఉన్నాయి. ఇక వీరికి మార్కాపురం, పెద్దారవీడు మండలాల పరిధిలో కాలనీలు ఏర్పాటు చేశారు. అక్కడ కూడా కనీస సౌకర్యాలు మెరుగుపరచాల్సి ఉంది. ఇళ్లు కట్టుకోవాలి. అందుకు ఇళ్లు కూడా మంజూరు చేయాల్సి ఉంది. వీటన్నింటికీ నిధులు పెద్ద ఎత్తున అవసరం ఉంది. గత ప్రభుత్వ హయాంలో అప్పటి సిఎం జగన్ ఈ ప్రాజెక్టును హడావుడిగా ప్రారంభించారు. నిర్వాసితులను పూర్తిగా వదిలేశారు. జూన్ తర్వాత ప్యాకేజీలు ఇస్తామని అప్పట్లో చెప్పారు. అధికారం మారినందున ఇప్పుడు ఎజెండా కూడా మారింది. సొరంగాల్లో లైనింగు పనులు కూడా పూర్తి కావాల్సి ఉంది. కాంట్రాక్టర్లకు చెల్లింపులు ఎంత మేరకు పెండింగులో ఉన్నాయనేదీ తేల్సాల్సి ఉంది. ఏదేమైనా ఈ ఏడాది వెలుగొండకు రూ.2 వేల కోట్లకు పైగా అవసరమని అంచనా. అన్నింటికీ నిధులతోనే ముడిపడి ఉంది. మంత్రులు సందర్శించాక దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేదీ చూడాల్సి ఉంది.

డీలర్లు సకాలంలో రేషన్ ఇవ్వాలి

ప్రజాశక్తి-సిఎస్ పురం

డీలర్లు లబ్ధిదారులకు సకాలంలో రేషన్ బియ్యం అందజేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రమేష్ తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల 1వ తేదీ నుంచి రేషన్ బియ్యం పంపిణీ చేయాలన్నారు. ఎవరైనా బియ్యం పంపిణీలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమయపాలన ఖచ్చితంగా పాటించాలన్నారు.

అధికారుల నిర్లక్ష్యం .. రైతులకు శాపం..

- ముందుకు కదలని వరద నీరు
- చెరువులను తలపిస్తున్న పొలాలు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

216 రహదారి నిర్మాణం రైతులకు శాపంగా మారింది. రోడ్డును రైతుల పొలాల మీదుగా ఏర్పాటు చేశారు. నిర్మాణ సమయంలో పొలాల్లోని నీరు బయటకు వెళ్లేలా డ్రైనేజీ సౌకర్యం ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆదిశగా చర్యలు తీసుకోలేదు. దీంతో వర్షం పడినప్పుడల్లా వర్షం నీరు బయటకు పోయే మార్గం లేక పొలాల్లోనే నిలిచిపోతుంది. రోజుల తరబడి నీరు నీల్వ ఉండటంతో పంటలు దెబ్బతింటున్నాయి. రైతులకు నష్టాలకు తప్పడం లేదు. ఇటీవల తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు కురిశాయి. నీరు పొలాల్లోకి చేరింది. బయటకు వెళ్లే మార్గం లేక మెట్టపొలాలు సైతం చెరువులను తలపిస్తున్నాయి. వరదబయటకు వెళ్ళేపరిస్థితి కనిపించడం లేదు. ఇప్పట్లో పొలాలు ఆరుదలకు వచ్చే పరిస్థితి లేదు. దీంతో రబీ సాగు



చెరువును తలపిస్తున్న పంట పొలాలు

అదును దాటుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు ఈ ఏడాది ఖరీప్ సీజన్ పూర్తిగా విఫలమైంది. రబీ సాగుపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. వరద నీరు రైతుల ఆశలను ఆవిరి చేసింది. మండల పరిధిలోని ఉప్పుగుండూరులో మాచవరం రోడ్డు సమీపంలో ఘుమారు 15 ఎకరాల్లో నీరు నిలబడి చెరువును తలిపిస్తోంది. మాచవరం రోడ్డులో అనేక చోట్ల డొంకలు ఆక్రమణలకు గురై నీరు పోయేమార్గం లేక ఆప్రాంతాల్లోని మెట్టపొలాలు కూడా చెరువులుగా మారాయి. ఉప్పుగుండూరులో మాచవరం రోడ్డుకు సమీపంలో 216 జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న వ్యవసాయ భూముల్లో అనుమతులు (కన్వర్షన్) లేకుండానే అడుగుల మేర మట్టి తోలి మెరక చేశారు. దీంతో వరద నీరు పోయే మార్గం లేకపోవడంతో రైతులకు నష్టాలు తప్పడం లేదు. ఈ విషయంపై అధికారులు అనేక సార్లు ఫిర్యాదు చేసినా ఫలి లేకుండా పోయిందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు, 216 జాతీయ రహదారి అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకొని వరద నీరు పోయేందుకు శాశ్వత పరిష్కారం చేపట్టి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

తల్లిదండ్రుల చెంతకు విద్యార్థులు

ప్రజాశక్తి- శింగరాయకొండ

తల్లిదండ్రులు మందలించారని ఇంటి నుంచి వెళ్లిపోయిన విద్యార్థులను పోలీసులు గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. శింగరాయకొండకు చెందిన ముగ్గురు అమ్మాయి, ఓ అబ్బాయి సోషల్ మీడియాలో చురుగ్గా ఉండటంతో ఈనెల 23న వారి తల్లిదండ్రులు మందలించారు. దీంతో వారు స్కూల్‌కు వెళ్తున్నామని చెప్పి రైలు ఎక్కి నెల్లూరు వెళ్లారు. అనంతరం తెనాలి, గుంటూరు వెళ్లారు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో వారి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల ఈ విషయం గురించి ఎస్‌పి దామోదర్‌కు సమాచారం అందించారు. స్పందించిన ఎస్‌పి ఒంగోలు డిఎస్‌పి రాయపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తప్పిపోయిన విద్యార్థుల గాలింపు కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి తప్పిపోయిన పిల్లలు గుంటూరు రైల్వే స్టేషన్‌లో ఉన్నట్లుగా గుర్తించి అక్కడ వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నారు. పోలీస్ కార్యాలయంలో ఎస్‌పి దామోదర్ చిన్నారులను శుక్రవారం వారి తల్లిదండ్రులకు అప్పగించారు. తప్పిపోయిన పిల్లలను కేవలం నాలుగు గంట వ్యవధిలోనే తిరిగి తల్లిదండ్రుల చెంతకు చేర్చిన శింగరాయకొండ సిఐ హాజరత్తయ్య, ఎస్‌ఐ బి. మహేంద్ర, ఎఎస్‌ఐలు మహబూబ్ బేగ్, మహబూబ్ బాషా, మహిళా కానిస్టేబుళ్లు శివకుమారి, అనూషను ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు.

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి -కొమరోలు : కొమరోలులోని సర్వెంట్ పాఠశాల విద్యార్థులు నియోజకవర్గస్థాయి ఎస్‌జిఎఫ్ పోటీల్లో ప్రతిభ చూపి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో మొత్తం 18 మంది విద్యా ర్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ ఎస్తేరు మేరీ తెలిపారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రాఠశాల హెచ్‌ఎం ఏస్తేరు మేరీ,పీడీ వెంకటసత్యం అభినందించారు.

మానవత్వం చాటుకున్న ఎస్ఐ

ప్రజాశక్తి- కొమరోలు : బైకు ఢీకొన్న ఘటనలో గాయపడిన వ్యక్తిని వైద్యశాలకు తరలించి కొమరోలు ఎస్ఐ వెంకటేశ్వర్లు నాయక్ మానవత్వం చాటుకున్నారు. అందిన వివరాల ప్రకారం.. మండల పరిధదిలోని అలసందపల్లె గ్రామం వద్ద గురువారం రాత్రి 9 గంటల సమయంలో రోడ్డు పక్కన వాకింగ్ చేస్తున్న వ్యక్తిని బైకు ఢీకొంది. దీంతో వాకింగ్ చేస్తున్న వ్యక్తికి కాలు విరిగింది. అదే సమయంలో అటుగా వస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు నాయక్ ఘటనా స్థలం ఆగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం తన వాహనంలో ఎక్కించుకొని గిద్దలూరులోని డిజెఆర్ వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రుడిని సకాలంలో వైద్యశాలకు తరలించిన ఎస్ఐ వెంకటేశ్వర్లు నాయక్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

బీచ్‌కెళ్తే బాదుడే.!

(మొదటిపేజీ తరువాయి)

పర్యాటకుల వద్ద నుండి ఫీజు వసూలు చేయాలన్న నిర్ణయం తీసుకుంటున్నట్లు ప్రకటించారు.ఇప్పటికే అక్కడ ఉన్న టోల్ గేట్ ను రద్దు చేసి వాహనాలు పార్కింగ్ చేసిన ప్రాంతానికి వెళ్లి పంచాయితీ సిబ్బంది నేరుగా వెళ్ళి పార్కింగ్ ఫీజు వసూలు చేసే విధంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీంతో పాటు సముద్ర తీరం వద్ద ఫెన్సింగ్ ఏర్పాటు చేసి బీచ్ లోకి ప్రవేశించేందుకు మూడు ప్రవేశ ద్వారాలను పెట్టి పర్యాటకులను బీచ్ లోకి అనుమతిస్తామని ఒక్కొక్కరి వద్ద నుండి రూ 20 వసూలు చేసే విధంగా ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు వెల్లడించారు. 2025 జనవరి 1 నుంచి ఈ విధానాన్ని అమలు చేస్తామని తెలిపారు.సూర్యలంక బీచ్ అభివద్ధి కోసం చేస్తున్న ఆదాయ మార్గాల అన్వేషణలో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు చెబుతున్నారు. బీచ్‌ల అభివృద్ధి కోసం, అక్కడి పంచాయతీల ఆదాయం కోసం మంటూ ఆహ్లాదం కోసం వచ్చే పర్యాటకుల నుంచి టోల్ బాదుడు ఏమిటనేది అర్థం కానిదిగా ఉంది కొత్తగా పెడుతున్న టోల్‌గేట్‌లు, ఫీజుల వసూలు వ్యవహారాల కోసం తీసుకుంటున్న అదనపు సిబ్బంది జీతభత్యాలు పోను ఏమి మిగులుతుంది అనేది ప్రశ్న.ఇలా పర్యాటకుల నుంచి వారు వచ్చే వాహనాల నుంచి ఫీజులు వసూలు చేయడం అనేది కొందరి జేబులు నింపడానికే తప్ప బీచ్‌ల అభివృద్ధికి ఎలా ఉపయోగ పడుతుంది అనే అనుమానాలు వ్యక్తమవు తున్నాయి. టోల్ బాదుడు వ్యవహారం పలు అనర్థాలకు దారి తీసి అధికార పార్టి నేతలకు తలనొప్పులు తేవడం తప్ప పెద్దగా ఉపయోగం ఏమి ఉండదని భావిస్తున్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

హెచ్‌ఐవి/ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కషి చేయాలని, విద్యార్థి దశ నుంచే సమాజ సేవలో భాగస్వాములు కావాలని అమ్మనబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయరాలు ఎం.సత్యవతి తెలిపారు. బాపట్ల,ప్రకాశం జిల్లాల హెచ్‌ఐవి/ఎయిడ్స్ నియంత్రణ నిర్మూలన సంస్థ, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ టిఐ ప్రాజెక్టు డైరెక్టర్ బివి.సాగర్ అధ్యక్షతన అమ్మనబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, విజ్ఞాన భారతి పాఠశాలలో హెచ్‌ఐవి/ఎయిడ్స్ సమూలన నిర్మూలన లక్ష్యంపై మీకు తెలుసా?ఐఇసి అవగాహన కార్యక్రమాల 8 అంశాలపై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయరాలు భారతి, విజ్ఞాన భారతి హైస్కూల్ ప్రిన్సిపల్ జమీర్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు చెడు అలవాట్లుకు బానిసలు కాకుండా తమ అమూల్యమైన జీవితాన్ని కాపాడుకోవాలన్నారు. అత్యాశ అపోహలకు గురికాకుండ మంచి విద్యాభ్యాసాన్ని అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించి సమాజాన్ని పట్టిపీడిస్తున్న హెచ్‌ఐవి/ ఎయిడ్స్ వ్యాధి నిర్మూలన కోసం



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

గ్రామస్థాయిలో కషి చేయాలన్నారు. హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బివి. సాగర్ మాట్లాడుతూ హెచ్‌ఐవి/ఎయిడ్స్ నిర్మూలన కోసం సూచనల సలహాలు కోసం జాతీయస్థాయిలో ఏర్పాటు చేసిన జాతీయస్థాయి టోల్ ఫ్రీ ఎయిడ్స్ 1097పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. హెచ్‌ఐవి/ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్షత చూపకుండా వారి పట్ల ప్రేమ కలిగి ఉండాలని తెలిపారు అనంతరం గ్రామంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, విజ్ఞాన భారతి పాఠశాల ఉపాధ్యాయులు టి. విజయలక్ష్మి, మోహన్‌రావు, మహేష్, హెల్ప్‌టిఐ నాగులప్పల పాడు ఔట్రిచ్ వర్కర్ మల్లేశ్వరి, పిఇలు దివ్య వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

నీటి కుంటలో పడి బాలుడు మృతి

ప్రజాశక్తి - గిద్దలూరు

ప్రమాద వశాత్తు నీటి కుంటలో పడిన ఘటనలో ఓ బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన గిద్దలూరు పట్టణంలోని సెయింట్ పాల్ కళాశాల సమీపంలో చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... గిద్దలూరు నల్లబండ బజారుకు చెందిన హుస్సేన్ (14) అనే బాలుడు బుధవారం సాయంత్రం ఆడుకోవటానికి ఇంటి నుంచి బయటకు వెళ్ళాడు. తర్వాత ఎంతకీ ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు హుస్సేన్ కనిపించడం లేదని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం నీటికుంట వైపు వెళ్లిన వారికి హుస్సేన్ మృతదేహం కనిపించింది. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీయించారు. హుస్సేన్ స్నేహితులతో కలిసి కుంటలో ఈత కొట్టేందుకు వచ్చినట్లుగా పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. బాలుడు తండ్రి పఠాన్ మహబూబ్ బాషా తమ కుమారుడి కొంతమంది హత్య చేశారంటూ అనుమానం వ్యక్తం చేస్తు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుకాణాల్లో తనిఖీ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల : మండలంలోని పురుగు మందుల దుకాణాలను అంతర్గత తనిఖీ బందం అధికారి కె.బాలాజీ నాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్టర్లు, బిల్ బుక్స్, ధరల పట్టికలను పరిశీలించారు. అనంతరం బాలాజీ నాయక్ మాట్లాడుతూ అనుమతి ఉన్న కంపెనీ పురుగు మందులనే రైతులను విక్రయించాలన్నారు. రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. అనుమతి లేని పురుగు మందులను రైతులకు విక్రయిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి.జవహర్ లాల్ నాయక్, పాల్గొన్నారు.

పుల్లలచెరువు : పుల్లలచెరువులోని పలు ఎరువుల దుఖాణాల్లో ఒంగోలు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. శ్రీరామ ట్రేడర్స్, వేణుగోపాల ట్రేడర్స్, శ్రీ విజయలక్ష్మి ట్రైడర్స్‌లో తనిఖీలు నిర్వహించారు. అనుమతులు లేకుండా విక్రయిస్తున్న ఎరువులు, పురుగుమందుల విక్రయాలను నిలుపుదల చేశారు. శ్రీరామ ట్రేడర్స్‌లో రూ. 1,67,150 విలువ గల ఎరువులు, రూ. 1,50,540 విలువైన పురుగు మందుల విక్రయాలను నిలుపుదల చేశారు. వేణుగోపాల ట్రైడర్స్‌లో రూ. 1,14,200ల విలువైన ఎరువులు, రూ. 1,12,030 విలువైన పురుగు మందుల విక్రయాలను నిలుపుదల చేశారు. శ్రీ విజయలక్షి ట్రైడర్స్‌లో రూ. 1,20,100 విలువైన ఎరువులు, రూ. 1,82,560 విలువైన పురుగు మందుల విక్రయాలను నిలుపుదల చేశారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు రవి బాబు, రామారావు, రవికుమార్, స్థానిక ఎఒ పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి-పొన్నలూరు : మండల పరిధిలోని వేంపాడు ముప్పాళ్ల గ్రామంలో పరిసరాల పరిశుభతపై వైద్యాధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణాధికారి సురేష్ బాబు మాట్లాడుతూ నీటితొట్లు, టైర్లు, కొబ్బరి బోండాలు, కూలర్‌లో నీరు నిలువ లేకండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్ర మంలో ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జిరాక్స్ మిషన్ బహూకరణ

ప్రజాశక్తి-మార్కాపురం : మండల పరిధిలోని గజ్జలకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పాఠశాల పూర్వ విద్యార్థి జిరాక్స్ మిషన్‌ను శుక్రవారం బహూకరించారు. పాఠశాలలో 2008-09 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు జెరాక్ మిషన్‌ను బహుకరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సాదం వీర నారాయణ, వి.నాగ అంజయ్య, ఐ.సాయి లోకేష్, నారు బాపన్‌రెడ్డి, జె.చిన్ననాసరయ్య, వైజ.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - బేస్తవారిపేట

మండల పరిధిలోని చిన్న ఓబినేనిపల్లి గ్రామంలో అక్రమ ంగా నిర్వహిస్తున్న మద్యం బెల్ట్ షాపుపై ఎస్ఐ రవీంద్రారెడ్డి శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 35 క్వార్టర్ (180 ఎంఎల్) బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవీంద్రారెడ్డి మాట్లాడుతూ ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహించినా, అక్రమంగా మద్యం తరలించినా, అక్రమంగా మద్యం కలిగి ఉన్నా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈదాడుల్లో పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

దొంగను పట్టుకున్న ప్రజలు

ప్రజాశక్తి - గిద్దలూరు

ఓ గృహంలో చోరీకి యత్నిస్తున్న వ్యక్తిని స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. అందిన వివరాల ప్రకారం... గిద్దలూరు పట్టణంలోని రైల్వే స్టేషన్ వీధిలో నివాసముంటున్న కొప్పరపు రమేష్ ఇంటికి తాళం వేసి ఉంది. గుర్తు తెలియని వ్యక్తి గురువారం రాత్రి ఆ ఇంటి తాళం పగులగొట్టి చోరీ యత్నిస్తుండగా స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పట్టుబడిన వ్యక్తి వైఎస్ఆర్ జిల్లా, కాశీనాయన మండలం, నరసాపురానికి చెందిన గోపవరపు ప్రసాద్‌గా గుర్తించారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అనగాని శివప్రసాద్

పశుగణన పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి - రేపల్లె

అఖిల భారత పశు గణన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరులు అనగాని శివప్రసాద్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పశుగణన పథకాల రూపకల్పనకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. అక్టోబర్ 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు పశుగణన జరుగుతుందని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లోని పశువులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు తదితర జంతువుల సంఖ్యను లెక్కిస్తున్నట్లు తెలిపారు. పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ నాంచారయ్య మాట్లాడుతూ పశుగణన పూర్తియిన ప్రతి ఇంటికి స్టికర్ అంటించనున్నట్లు తెలిపారు. ప్రతి రైతు పశు గణన చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎ ప్రవీణ్ కుమార్, గుత్తావారిపాలెం డాక్టర్ రోషన్ బేగ్, మున్సిపల్ కమీషనర్ సాంబశివరావు, పశు సంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఎల్ఐసి ఏజెంట్లు

ఎల్ఐసి ఏజెంట్లకు కమీషన్ పెంచాలి

ప్రజాశక్తి - రేపల్లె

మచిలీపట్నం ఎల్ఐసి డివిజన్ పరిధిలో పనిచేస్తున్న ఎల్ఐసి ఏజెంట్లకు కమిషన్ పెంచాలని, జీఎస్టీ ఎత్తివేయాలని, పాలసీ దారులకు మెరుగైన సేవలు అందించాలని కోరుతూ స్థానిక ఎల్ఐసి కార్యాలయం వద్ద ఏజెంట్లు శుక్రవారం గేట్‌మీట్ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏజెంట్లు పెద్ద పెట్టిన నినాదాలు చేశారు. సోమవారం పూర్తి డ్రై డేగా పాటించి ఏజెంట్లు అందరూ నిరసన తెలియజేస్తామని ఏజెంట్ అసోసియేషన్ అధ్యక్షులు బసవరాజు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డి బసవరాజు, ఎం రాంబాబు, ట్రెజరర్ టిడిఎల్ ప్రసాద్, ఉపాధ్యక్షులు చిరంజీవి, జగన్నాథరావు, పద్మావతి, జాయింట్ సెక్రెటరీ ఉపేంద్ర, ఆర్గనైజర్ సెక్రెటరీ పివి సుబ్రహ్మణ్యం, డివిజన్ కార్యదర్శి గరికపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి చింతల శ్రీకృష్ణయ్య

సమన్వయంతో పనిచేయాలి

ప్రజాశక్తి - నగరం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపిపి చింతల శ్రీ కృష్ణయ్య మాట్లాడారు. అధికారులు అందరూ స్థానిక ప్రజా ప్రతినిధులు కలిసి మండల అభివృద్ధి సహకరించాలని కోరారు. ప్రభుత్వ పరంగా వచ్చే సంక్షేమ పథకాలు రాజకీయాలకు అతీతంగా వర్తింపజేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ బి శ్రీనివాసరావు, ఎంఈఓ జి వీరాంజనేయులు, అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు

ట్యాంకులను శుభ్రం చేసేదెప్పుడో.?

- దుర్వాసన వస్తున్న నీరు
- పట్టించుకోని అధికారులు
- ప్రజలకు తప్పని ఇక్కట్లు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ప్రజలకు సురక్షిత జలాన్ని అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం మండల పరిధిలోని అన్ని పంచాయతీల్లో వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేసింది. సుమారు 54 ట్యాంకులు ఏర్పాటు చేశారు. డీప్‌బోర్ల ద్వారా కొన్ని ట్యాంకులకు నీరు వదిలి పైప్‌లైన్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. త్రిపురాంతకం మండలలంలోని నడిగడ్డ, దూపాడు, పుల్లలచెరువు మండలంలోని ముటుకుల గ్రామాల్లో సాగర్ నీటి కాలువ అనుసందానంగా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను



వాటర్ ట్యాంక్

ఏర్పాటు చేసి ఆ ట్యాంకుల ద్వారా గ్రామాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులకు సాగర్ నీటిని పంపింగ్ చేసి తిరిగి పైప్‌లైన్‌ల ద్వారా కొన్ని గ్రామాలకు నీటిని సరఫరా చేసే చర్యలు చేపట్టారు. రెండు వారాలకొసారి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాల్సి ఉంది. ఎక్కడా అలాంటి చర్యలు చేపట్టడం లేదు. తాగునీరు కలుషితం అవుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకుల లోపల పాచి పేరుకు పోవడంతో నీరు దుర్వాసన వస్తుందని వారు పేర్కొంటున్నారు. సచివాలయం పరిధిలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ట్యాంక్ల శుభ్రత, క్లోరినేషన్ గురించి పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వర్షాకాలంలో నీరు రంగు మారడంతో పాటు ట్యాంకుల శుభ్రత లోపించడం వల్ల రోగాలకు గురి కావాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. కార్యదర్శులు పారిశుధ్యం, ట్యాంకుల శుభ్రతపై దృష్టి సారించడం లేదని, మంచినీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరచాలని కోరుతున్నారు.

మద్యానికి డబ్బులివ్వలేదని..

భర్త ఆత్మహత్య

ప్రజాశక్తి-మార్కాపురం

మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వలేదని భార్యపై కోపంతో భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శుక్రవారం జరిగింది. తెలిసిన వివరాలు ఇలా... మండలంలోని భూపతిపల్లికి చెందిన గాయం సాంబశివారెడ్డి గతంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. అతను ఏ పని చేయలేకున్నాడు. ఇటీవల కాలంలో సారాకు బానిసయ్యాడు. మద్యం కొనుక్కునేందుకు డబ్బు ఇవ్వాలని భార్య దీప్తిని కోరగా అందుకు నిరాకరించింది. దీప్తి కూలీ పనులతో వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషిస్తోంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా డబ్బు ఇవ్వలేకపోయిన భార్య దీప్తిపై భర్త



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

సాంబశివారెడ్డి ఆగ్రహించాడు. ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. పై కప్పుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న మార్కాపురం రూరల్ ఎస్ఐ అంకమరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రాజమోహన్‌రావు



అహరోను

టూ టౌన్ ఎస్ఐగా రాజమోహన్‌రావు

పట్టణ ట్రాఫిక్ ఎస్ఐగా అహరోను

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం టూ టౌన్ ఎస్ఐగా ఎం.రాజమోహన్‌రావు నియమితులయ్యారు. మొన్నటి వరకు ఆయన మార్కాపురంలో పిఎస్ఐగా పని చేశారు. మార్కాపురం పట్టణంలో ట్రాఫిక్ ఎస్ఐగా సిహెచ్ అహరోను నియమితులయ్యారు. జిల్లా ఎస్పి ఎఆర్ దామోదర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ కొండయ్య

టిడిపి సభ్యత్వంతో ప్రయోజనాలు

ప్రజాశక్తి - చీరాల

తెలుగుదేశం సభ్యత్వ నమోదు పట్ల ప్రజలకు అవగాహన కల్పించి వాటి ప్రయోజనాలను వివరించాలని శాసన సభ్యులు ఎంఎం కొండయ్య అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, ముఖ్య నేతలతో సభ్యత్వం నమోదుపై విస్తృతస్థాయిలో సభ్యత్వం నమోదు విషయమై అవగాహన కల్పించారు. సభ్యత్వం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. రూ.100 చెల్లించి సభ్యత్వం తీసుకోవడం వలన రూ.5లక్షల ప్రమాద బీమా, విద్యా, వైద్య, ఉపాధి కోసం తెలుగుదేశం సాయం అందించనున్నదని అన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు నాసిక వీరభద్రయ్య, డాక్టర్ సజ్జ హేమలత, టిడిపి మండల అధ్యక్షులు గంజి పురుషోత్తం, టిడిపి బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు జనార్ధన్, తెలుగుదేశం క్లస్టర్, బూత్, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యా వికాసమే దీక్షరంభ్ లక్ష్యం

ప్రజాశక్తి - బాపట్ల

వ్యవసాయ విద్యలో నూతన విద్యా వికాసమే లక్ష్యంగా బాపట్ల వ్యవసాయ కళాశాల్లో దీక్షారంభ్ కార్యక్రమానికి ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శ్రీకారం చుడుతుందని ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉప కులపతి కె శారద జయలక్ష్మి దేవి అన్నారు. స్థానిక వ్యవసాయ కళాశాల్లో దీక్షారంభ్ ప్రారంభ సభలో ఆమె మాట్లాడుతూ విశ్వవిద్యాలయ విధి, విధానాలు, క్రమశిక్షణ అంశాలపై విద్యార్థులకు అవగాహన కలిగించేందుకు కార్యక్రమం దోహద పడుతుందని అన్నారు. వ్యవసాయ విద్య కోసం కళాశాల ప్రాంగణంలోకి కొత్తగా అడుగుపెడుతున్న మొదటి సంవత్సర విద్యార్థినీ, విద్యార్థులకు కళాశాల వాతావరణం పట్ల అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కళాశాల పరిసరాలు, తోటి విద్యార్థులు, అధ్యాపకులను పరిచయం చేయటం ద్వారా వారిలో బెరుకుతనాన్ని పోగొట్టి దీక్షా దక్షతలతో విద్యాభ్యాసాన్ని కొనసాగించడమే లక్ష్యంగా యుజిసి నిర్దేశించిన దీక్షారంభ్ విధానాలను అనుసరిస్తూ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ పి ప్రసూనరాణి మాట్లాడుతూ పది రోజులపాటు నిర్విఘ్నంగా జరిగే కార్యక్రమంలో కొత్త విద్యార్థులకు పరిచయం, వివిధ డిపార్టుమెంట్లు, గ్రంథాలయం, హెల్త్ క్లినిక్, క్రీడా ప్రాంగణం, కళాశాల వ్యవసాయ క్షేత్రం సందర్శన, అనుభవజ్ఞులైన పూర్వ అధ్యాపకులు, వివిధ రంగాల్లో నిష్ణాతులైన ప్రముఖులచే ప్రసంగాల ద్వారా నూతన విద్యార్థుల్లో మానసిక వికాసాన్ని పెంపొందిచనున్నట్లు తెలిపారు. వక్తృత్వం, వ్యాస రచన, క్రీడలు, వివిధ సాంస్కృతిక పోటీలు నిర్వహించి నవంబర్ 2న జరిగే ప్రత్యేక కార్యక్రమంలో బహుమతి ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. డీన్ ఆఫ్ అగ్రికల్చర్ సిహెచ్ శ్రీనివాసరావు, ఆహార విజ్ఞాన కళాశాల డీన్ డాక్టర్ ఎం సర్దార్ బేగ్, వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల డీన్ స్మిత్, ఎన్సిసి, ఎన్ఎస్ఎస్ అధికారులు, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.



దీక్షారంభ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న విసి



వర్ధంతి కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ కార్యదర్శి గనిరాజు

శ్రీనివాసరావుకు నివాళి

ప్రజాశక్తి - రేపల్లె

పీడిత ప్రజల నాయకుడు కామ్రేడ్ బెజ్జం శ్రీనివాసరావని ఎఐకెఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శియు గనిరాజు అన్నారు. పట్టణంలోని ఉప్పాడి కాలువ కట్టపై కామ్రేడ్ శ్రీనివాసరావు 6వ వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని అన్నారు. కామ్రేడ్ శ్రీనివాసరావు ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా జరిగిన భూ పోరాటాల్లో పాల్గొన్నారని గుర్తు చేశారు. దళితులు, మహిళలపై జరిగిన దాడులకు వ్యతిరేకంగా ఉద్యమించాడని అన్నారు. పీడిత ప్రజా నాయకుడు శ్రీనివాసరావు ఆశయాల సాధనకై పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్ పోతురాజు, సముద్రాలు గిరిజమ్మ, రాజేశ్వరరావు, చిన్నదుర్గ, దీపిక, శివయ్య పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు పెసర్లంక విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి - భట్టిప్రోలు

గుంటూరు జిల్లా అండర్ 14 బాల, బాలికల కబడ్డీ జిల్లా జట్టుకు బాపట్ల మునిసిపల్ ఉన్నత పాఠశాల్లో ఎంపికలు నిర్వహించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా బాలికల కబడ్డీ జట్టులో పెసర్లంక జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని



పులివర్తి లికిత

పులివర్తి లిఖిత ఎంపికైనట్లు హెచ్‌ఎం షేక్ మహబూబ్ బాషా తెలిపారు. నవంబర్ 9, 10, 11 తేదీల్లో పిట్టలవానిపాలెంలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిత్యం వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర పోటీలకు ఎంపికైన విద్యార్థినిని, పిఇటి దాసరి వెంకట ప్రసాద్‌లను అభినందించారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడొచ్చు..

కనిగిరి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి భరత్‌చంద్ర



రక్తదానం చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కనిగిరి

రక్తదానంతో ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చని కనిగిరి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి భరత్‌చంద్ర, మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ తెలిపారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కనిగిరిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి భరత్‌చంద్ర, మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్‌గఫార్‌తో పాటు పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు, రక్తదానం చేశారు. రక్తదానం పట్ల అపోహలు వీడి రక్తదానం చేయాలని సూచించారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిఐ ఎస్.కె ఖాజావలి, ఎస్ఐలు తుళ్లూరి శ్రీరామ్, మాధవరావు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

గౌరవ మర్యాదలు అలవరుచుకోవాలి

జడ్‌పి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



విద్యార్థులతో బూచేపల్లి వెంకాయమ్మ, సురేష్

ప్రజాశక్తి-మార్కాపురం

చదువుతో పాటు గౌరవ మర్యాదలు నేర్చుకోవాలని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ విద్యార్థులకు సూచించారు. స్థానిక జార్జి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రథమ సంవత్సర విద్యార్థుల ఆగమన వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. బి.టెక్, డిప్లొమా, ఐటిఐ విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమాన్ని జడ్‌పి చైర్‌పర్సన్ వెంకాయమ్మతో పాటు మాజీ మంత్రి, ఆ కళాశాల సాంకేతిక సలహాదారులు డాక్టర్ ఆదిమూలపు సురేష్ ప్రారంభించారు. ముందుగా డాక్టర్ సురేష్ మాట్లాడారు. కళాశాలలో కల్పించిన వసతులన్నీ వినియోగించుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. రానున్న రోజుల్లో కళాశాలలోనే సెంటర్ ఫర్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ స్థాపించనున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ప్రసంగించారు. సమాజం పట్ల బాధ్యతను అలవరచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ రాజబాబు, డీన్ అకడమిక్ డాక్టర్ ఎం.మస్తానయ్య, వివిధ విభాగాల అధిపతులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నత్యాలు అలరించాయి.

ఎస్‌హెచ్‌జిలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా



చెక్కు అందజేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పొదుపు, ఆర్థిక క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిన స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జి) మహిళలు మరో అడుగు ముందుకేసి లక్షాధికారులు, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. 'కెనరా నారీ శక్తి' పేరుతో డిఆర్‌డిఏ సౌజన్యంతో శుక్రవారం స్థానిక ఏ1 కన్వెన్షన్ హాలులో కెనరా బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన రుణమేళాలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కెనరా బ్యాంకు ప్రాధాన్యతా రంగ రుణ విభాగ (పిసి) జనరల్ మేనేజర్ మమతా ఏ.జోషి, డిఆర్‌డిఏ పీడీ టి.వసుంధరలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత స్టాల్స్‌ను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఏ పీడీ టి.వసుంధర, ఎల్.డి.ఎం రమేష్, కెనరా బ్యాంకు ఏజిఎం శశిధర్, డిపిఎంలు పి.డేవిడ్, సనీత, ఎపిఎంలు, సిసిలు, 1000 మంది ఎస్‌హెచ్‌జి మహిళలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు

ఆక్రమణలకు గురికాకుండా చర్యలు: జేసీ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

వివిధ ప్రభుత్వ శాఖలకు కేటాయించిన భూములు ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని సంయుక్త కలెక్టర్ ఆర్. గోపాలకష్ణ ఆదేశించారు. శుక్రవారం వివిధ శాఖల ఉన్నతాధికారులతో ప్రకాశం భవనంలో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పలు అవసరాల కోసం గతంలో వివిధ శాఖలకు కేటాయించిన భూముల స్థితిగతులపై ఈ సందర్భంగా ఆయన సమీక్షించారు. కాగా, ఎలాంటి ఆక్రమణలు జరగలేదని ఆయా శాఖల అధికారులు జాయింట్ కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో డిఆర్‌ఒ ఆర్.శ్రీలత, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్, కనిగిరి ఆర్.డి.ఓ. కేశవర్ధన్‌రెడ్డి, ఒంగోలు ఆర్డీవో కె.లక్ష్మీ ప్రసన్న, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఓపెన్‌హౌస్ ఎగ్జిబిషన్

- ఆకట్టుకున్న ఆయుధాల ప్రదర్శన - అబ్బురపరచిన జాగిలాల విన్యాసాలు



ఆయుధాలను పరిశీలిస్తున్న ఎస్‌పి దామోదర్



జాగిలం విన్యాసం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా ఒంగోలు పోలీస్ కళ్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్ ఉత్సాహంగా సాగింది. ఈ ఎగ్జిబిషన్‌ను జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్ ప్రారంభించి పోలీసులు వినియోగించే ఆయుధాలు, పరికరాలు, సాధనాలు, సాంకేతిక ఉపకరణాలపై విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీసు అమరులను స్మరించుకోవడంతో పాటు సమాజంలో పోలీసుల పాత్ర, విధులు, త్యాగాలపై ప్రజల్లో అవగాహన తీసుకొచ్చేందుకు స్మారకోత్సవాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోలీసుల విధులు, వారు వాడే ఆయుధాలు, పరికరాలు, బాధ్యతలు, శాంతిభద్ర నిర్వహణ వంటి అంశాలను విద్యార్థి దశలోనే తెలుసుకోడానికి ఈ ఓపెన్ హౌస్ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకొని, క్రమశిక్షణ అలవర్చుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. లా అండ్ ఆర్డర్ విషయంలో ప్రశాంత వాతావరణానికి ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్‌పి కోరారు. ఓపెన్ హౌస్ కార్యక్రమంలో పోలీసులు వాడే ఆయుధాలు, పరికరాల ప్రదర్శన ఆకట్టుకుంది.

అబ్బురపరిచిన పోలీస్ జాగిలాల విన్యాసాలు

విన్యాసాలులో భాగంగా తొలుత జిల్లా ఎస్‌పికి చీటా, మ్యాగీ, జాకీ జాగిలాలు గౌరవ వందనం చేశాయి. ఒబిడియన్స్ వ్యాయామం తదుపరి మ్యాగీ జాగిలం పేలుడు పదార్థాలు ఉంచిన బాక్సులను గుర్తించాయి. ఆ తర్వాత జాకీ జాగిలం తన కర్తవ్య నిర్వహణలో భాగంగా ఎన్ని అడ్డంకులు ఎదురైనా దాటకుంటూ లక్ష్యాన్ని ఛేదించేందుకు ఉపయోగపడే హార్డిల్స్ జంపు విన్యాసాలను, సేంట్ డిస్క్రిప్షన్ గుర్తించాయి. ఈ జాగిలాలు పేలుడు పదార్థాలు మరియు హత్యలు, దొంగతనాలు జరిగిన సందర్భాలలో నిందితులను గుర్తించడం కోసం జాగిలాలు విధులు నిర్వహిస్తాయి. ఈ జాగిలాలు చేసిన విన్యాసాలు విద్యార్థులను ఎంతగానే అబ్బురపరిచాయి. కార్యక్రమంలో ఏఎస్‌పి (అడ్మిన్) కె.నాగేశ్వర రావు, ఎఆర్ ఏఎస్‌పి అశోక్ బాబు, ఒంగోలు డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, ఎఆర్ డిఎస్‌పి చంద్ర శేఖర్, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ కెవి రాఘవేంద్ర, ఒంగోలు తాలూకా సిఐ అజయ్ కుమార్, ఒంగోలు వన్ టౌన్ సిఐ నాగరాజు, ఒంగోలు టు టౌన్ సిఐ ఎం.శ్రీనివాసరావు, ఒంగోలు రూరల్ సిఐ ఎన్ శ్రీకాంత్ బాబు, ఆర్ఐలు రమేష్ కష్ణన్, రమణా రెడ్డి, సీతారామరెడ్డి, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.



వినికిడి పరీక్షల కార్యక్రమంలో డాక్టర్ ప్రభాకర్

223 మందికి వినికిడి పరీక్షలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ డిసురేష్ కుమార్ నేతృత్వంలో ఎన్‌సిడి నోడల్ అధికారి డాక్టర్ భగీరథి. దీన దయాళ్ శ్రవణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వినికిడి యంత్రాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల (క్యాజువాలిటీ మిద్దె) లో ఆర్‌బిఎస్‌కె కేంద్రంలో కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో చెవిటి, మూగ స్కూల్ ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో పాఠశాల 92 మంది విద్యార్థులు 132 మంది పెద్దలు 223 మందిని పరీక్షించారు. అర్హులైన వారందరికి దీన దయాళ్ శ్రవణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా వినికిడి యంత్రాలను అందజేయనున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి రామాంజినేయలు తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు వైద్య కళాశాల ఈఎన్‌టి విభాగాధిపతి డాక్టర్ ప్రభాకర్, చెవిటి, మూగ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-మార్కాపురం

స్థానిక వాసవీ విద్యానికేతన్ విద్యార్థిని సిహెచ్ హేమలత రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. చీరాలలో జరిగిన ఎస్‌జిఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో అండర్-14 విభాగంలో ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ అండ్ కరస్పాండెంట్ కందేపు రంగయ్య, ఏవో కె.రంజిత్‌కుమార్‌లు శనివారం తెలిపారు. పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఎంపికైన హేమలతను సత్కరించారు. పిఇటి లు ఆర్.ఆంజనేయులు, లాజర్ పాల్గొన్నారు.

సోలార్ కనెక్షన్లకు సబ్సిడీ సౌకర్యం

- జిల్లాలో పథకం అమలుకు 71 బృందాలు
- ఎపిసిపిడిసిఎల్ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు



ఎస్ఈ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రధాన మంత్రి సూర్యఘర్ కార్యక్రమంలో భాగంగా సౌర విద్యుత్ పథకంలో విద్యుత్ కనెక్షన్ తీసుకునే వినియోగదారులకు సబ్సిడీతో పాటు బ్యాంకు రుణ సౌకర్యం అందిస్తామని ఎపిసిపిడిసిఎల్ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం ఎస్ఈ కార్యాలయం లో విద్యుత్ శాఖ డిఈలు, వెండర్స్ తో సోలార్ ఎనర్జీ వినియోగంపై వినియోగదారులకు అవగాహన కల్పించడంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎస్ఈ మాట్లాడుతూ, ప్రతి ఇంటిని సూర్యఘర్ పథకంలోకి తీసుకువచ్చేందుకు కషి చేస్తున్నామన్నారు. ప్రకాశం జిల్లాలోని 71 సెక్షన్లలో 71 మంది సెక్షన్ ఆఫీసర్లు 150 మంది ఇతర సిబ్బంది బృందాలుగా ప్రతీ ఇంటికి వెళ్లి వినియోగదారులను చైతన్య పరుస్తారన్నారు. సోలార్ కనెక్షన్ తీసుకున్న వినియోగదారునికి ప్రస్తుతం ఉన్న ఎనర్జీ మీటర్ స్థానంలో బై డైవర్షన్ మీటర్‌ను పెడతారన్నారు. లక్ష రూపాయలకు రూ.80 వేలు బ్యాంకుకు రుణం ఇస్తుందని, మిగిలిన రూ.20 వేలు కట్టిన వెంటనే కనెక్షన్ ఇస్తారన్నారు. కార్యక్రమంలో డిఈలు అబ్దుల్ కరీం, హరిబాబు, శ్రీనివాసులు, వెండర్స్ పాల్గొన్నారు.

పశుగణనలో

సమగ్ర సమాచారాన్ని సేకరించాలి

కలెక్టర్ నివాసంలో వివరాల సేకరణ



వివరాల ప్రతిని కలెక్టర్‌కు అందజేస్తున్న బేబీరాణి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

నిర్ణీత గడువు లోపు జిల్లాలోని ప్రతి ఇంటిని సందర్శించి, పశుగణన సమగ్ర సమాచారాన్ని సేకరించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలు, పట్టణాలలో శుక్రవారం ప్రారంభమైంది. పశుసంపద లెక్కింపు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బేబీరాణి తన సిబ్బందితో కలసి కలెక్టర్ గారి నివాసాన్ని సందర్శించి.. వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా వివరాలు సేకరించినట్లుగా పశు సంవర్ధక శాఖ సిబ్బంది గోడపై స్టికర్‌ను అంటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు కొనసాగనుందని, నిర్ణీత గడువులోపు జిల్లాలోని ప్రతి ఇంటిని సందర్శించి, పశుగణన సమగ్ర సమాచారాన్ని సేకరించాలన్నారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బేబి రాణి, సిబ్బంది పాల్గొన్నారు.



108 వాహనానికి అడ్డుగా నిలిపిన ఆర్టీసీ బస్సు

108కు అడ్డుగా ఆర్టీసీ బస్సు

ప్రజాశక్తి - పంగులూరు

అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగికోసం కోసం వెళుతున్న 108 వాహనానికి ఆర్టీసీ బస్సును అడ్డంపెట్టి ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంఘటన శుక్రవారం పంగులూరులో చోటు చేసుకుంది. అత్యవసరంగా వెళ్లాలని బస్సు, ఆటో తొలగించాలని 108 వాహన డ్రైవరు అడిగినప్పటికీ తాను తీసేది లేదని, దిక్కున్న చోట చెప్పుకోమని ఆర్టిసి డ్రైవర్ మొండికేసి నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు గ్రామస్తులు తెలిపారు. మండలంలోని బూదవాడకు చెందిన ఒక వ్యక్తిని అత్యవసరంగా ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు 108కు సమాచారం వచ్చింది. దీంతో పంగులూరులోని ప్రభుత్వ వైద్యశాల దగ్గర ఉన్న 108 వాహనాన్ని తీసుకొని డ్రైవర్ బయలుదేరాడు. పంగులూరు సెంటర్‌లో 108 వాహనానికి ఇంకొల్లు వైపు నుండి వచ్చే ఆర్టీసీ బస్సు అడ్డం వచ్చింది. 108 వాహనం ముందుకు కదిలే పరిస్థితి లేదు. డ్రైవరు బస్సును కొంచెం వెనుకకు తీసుకెళ్లండి. తాము అర్జెంటుగా పేషెంట్ కోసం వెడుతున్నామని చెప్పిన వినకుండా బస్సును అలాగే నిలిపివేశాడు. అదేమని అడిగితే నీ దిక్కున్న చోట చెప్పుకో తాను బస్సు తీయనని బస్సును అడ్డుగా నిలిపాడు. స్థానికులు చెప్పిన వినకుండా బస్సును కదపలేదు. దీంతో 108 డ్రైవరు తన వాహనాన్ని వెనక్కి తీసుకెళ్లి బస్సుకు దారి ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చింది. ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యం పట్ల స్థానికులు నివ్వెర పోయారు.



శస్త్ర చికిత్స కోసం శంకర్ వైద్యశాలకు తరలిస్తున్న దృశ్యం

ఉచిత నేత్ర వైద్యశిబిరం

ప్రజాశక్తి - అద్దంకి

రోటరీ క్లబ్, ఉమ్మడి ప్రకాశం జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర నేత్రాలయం ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ భవన్లో ఉచిత నేత్ర వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఆప్తమాలజిస్ట్ డాక్టర్ ఉమాదేవి, శంకర నేత్రాలయ ప్రతినిధి సైదులు, కంటి సమస్యలున్న 40 మందిని పరీక్షించారు. శుక్లాల ఆపరేషన్ అవసరమైన 20 మందిని పెదకాకాని శంకర నేత్రాలయంకు తరలించారు. గత నెలలో శుక్లం ఆపరేషన్ చేయించు కున్నవారికి కొత్త కళ్లజోళ్ళు అందచేశారు. దేహంలో కళ్ళను జాగ్రత్తగా సంరక్షించు కోవాలని డాక్టర్ యు దేవపాలన పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆధునిక వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రోటరీ క్లబ్ సేవలు అందిస్తుందని తెలిపారు. రోటరీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, సహాయ కార్యదర్శి అళహరి హరిప్రసాద్, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, సహాయ గవర్నర్ షేక్ మహమ్మద్ రఫీ, సందిరెడ్డి శ్రీనివాసరావు, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, కాకర్ల వెంకటేశ్వర్లు, చామర్తి గురుశేఖర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి అద్దంకి

దక్షిణ అద్దంకి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మత్తుల కారణంగా శనివారం ఉదయం 8 నుండి 12గంటల వరకు దక్షిణ అద్దంకి, నాగులపాడు, వేలమూరిపాడు, జార్లపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందని రూరల్ ఎఇ ఎన్ శ్రీనివాసరావు తెలిపారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

'గుండ్లకమ్మ నది' సర్వే ప్రారంభం

ప్రజాశక్తి - అద్దంకి

కోర్టు ఆదేశాల మేరకు అద్దంకి రెవెన్యూ పరిధిలో గుండ్లకమ్మ పూర్తి విస్తీర్ణం హద్దులకు మండల సర్వేయర్ ఎన్ శ్రీలక్ష్మి, గ్రామ సచివాలయాల సర్వేయర్లతో తహశీల్దారు జి చరణ్ ఆదేశాల మేరకు శుక్రవారం సర్వే పనులు ప్రారంభించారు. గత మార్చి నెలలో ప్రజా సంఘాల తరపున పొల్యూషన్ కంట్రోల్, రివర్ కన్జర్వేషన్ యాజిటేషన్ కమిటీ కన్వీనర్ మన్నం త్రిమూర్తులు అద్దంకి కోర్టు లీగల్ సెల్ నందు పిఎల్పి దాఖలు చేశారు. అందులో భాగంగా కోర్టు ఉత్తర్వులు మేరకు అద్దంకి బ్రిడ్జికి ఉత్తర వైపున నరసింహపురం (డి పాపులేషన్ విలేజ్) పరిధిలో 20పాయింట్లు గుర్తించి ఎరుపు, తెలుపు జండా కర్రలను పాతారు. గుండ్లకమ్మకు తూర్పు వైపున ఏడు భాగాలుగా కొలతలు ఉన్నవని, నదికి ఇరువైపులా పూర్తి విస్తీర్ణం కొలతలతో హద్దులను నిర్ణయిస్తామని తెలిపారు. పట్టణ అభివృద్ధి అధ్యక్షుడు త్రిమూర్తులు మాట్లాడుతూ గుండ్లకమ్మలో జంగిల్ క్లియరెన్స్ చేయమని, చెత్తా చెదారం, విష పదార్థాలు గుండ్లకమ్మలో డంపు చేయటం నియంత్రించాలని కోరారు. ప్రజారోగ్యానికి హాని కలిగించే విధంగా అదుపులేని ఆక్రమణలు అడ్డుకోవాలని అన్నారు. నదికి ఇరువైపులా సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని గత 15ఏళ్ల పైబడి పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ఈ పోరాట ఫలితమే


గుండ్లకమ్మ నది పూర్తి సర్వేకు శ్రీకారం చుట్టిన అధికారులు

గుండ్లకమ్మనది సర్వే ప్రారంభం అన్నారు. రూపు రేఖలు కోల్పోతున్న గుండ్లకమ్మను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. బాధ్యత గల పౌరులు, మేధావులు ఇందులో భాగస్వాములు కావాలని కోరారు. సర్వేకు తమ సహకారం అందిస్తామని వచ్చిన బుద్ధిష్టి సొసైటీ జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లూరు బాబురావు, డాక్టర్ కావూరి రఘుచందన్ను అభినందించారు. కార్యక్రమంలో దాస భారతీయ జానపద కళాక్షేత్రం అధ్యక్షులు చెన్నుపల్లి నాగేశ్వరరావు, తంగరాల వెంకటేశ్వర్లు, తిమ్మాయపాలెం, కలవకూరు, చిన్నకొత్తపల్లి సచివాలయ సర్వేయర్లు సంధ్య, పవన్ కళ్యాణ్, అంకమ్మ నాయుడు, యోగి, నాగేశ్వరావు, శ్రీను పాల్గొన్నారు.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఎన్ శ్రీహర్ష


అవగాహన కలిగిస్తున్న పంగులూరు వైద్య సిబ్బంది

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి - అద్దంకి

ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని మోదేపల్లి పిహెచ్‌సి డాక్టర్ ఎన్ శ్రీహర్ష అన్నారు. పిహెచ్‌సి పరిధిలోని మోదేపల్లి సచివాలయంలో సీజనల్ వ్యాధులపై శుక్రవారం ప్రజలకు అవగాహన కల్పించారు. అధిక వర్షాల కారణంగా డయేరియా వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలందరు కాచి చల్లార్చిన నీరు త్రాగడం, వేడిగా ఉన్నప్పుడే ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. ఆహార పదార్థాలపై మూతలు తప్పని సరిగా ఉంచుకోవాలని అన్నారు. చేతులు పరిశుభ్రత పాటించడం, క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే త్రాగాలని చెప్పారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ఇంటి పరిసరాల్లో చెత్త, మురుగు నిల్వలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, మెదడు వ్యాపు తదితర వ్యాధులు రాకుండా దోమతెరలు వాడాలని వివరించారు. అనారోగ్య సమస్యలు కనిపిస్తే వెంటనే సమీపంలోని వైద్యులను సంప్రదించాలని చెప్పారు. సొంత వైద్యం వాడవద్దని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సెక్రెటరీ కె అనిల్, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ స్రవంతి, ఎంపీహెచ్ఈఓ ఎ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పంగులూరు : ప్రస్తుతం గ్రామాల్లో సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాటి నిర్మూలనకు అందరూ కృషి చేయాలని పిహెచ్‌సి వైద్య సిబ్బంది ప్రజలకు సూచించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమం సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ఆరోగ్యం పట్ల వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కలిగించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిలువ లేకుండా చూసుకోవాలని చెప్పారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత అవసరమని చెప్పారు. దోమలకు నివాసాలైన కొబ్బరి బోండాలు, రోలు, తొట్టు, కూలర్లు, డబ్బాలు వంటి వాటిని ఎప్పటికప్పుడు నీరు నిలువ లేకుండా చూసుకోవాలని కోరారు. దోమలు కుట్ట కుండా దోమతెరలు వాడాలని, కిటికీలకు మెష్‌లు బిగించు కోవాలని చెప్పారు. మంచినీటిని కాచి చల్లార్చుకుని తాగాలని అన్నారు. మురుగు నీరు కాలువల్లో నీరు నిల్వ ఉన్నచోట మడ్డి ఆయిల్, బ్లీచింగ్ చల్లాలని చెప్పారు. మంచినీటిలో డెంగ్యూ దోమలు పెరుగుతాయని అన్నారు. రోగాలు వచ్చిన తర్వాత బాధపడే బదులు రోగాలు రాకముందే జాగ్రత్తలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్వైజర్ హరిబాబు, ఎఎన్ఎంలు, సిహెచ్‌ఓలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదరికాన్ని రూపుమాపడమే లక్ష్యం

ప్రజాశక్తి - రేపల్లె

మెప్మా ఆధ్వర్యంలో అర్బన్ మార్కెట్ స్టాల్స్‌ను గురువారం ప్రారంభించారు. స్థానిక రైల్వే కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో వివిధ రకాల వస్తువులు, పిండివంటలు, చేనేత వస్త్రాలు, చెక్కబొమ్మలు, మహిళల అవసరాలకు కావలసిన వస్తువులను అమ్మకానికి ఉంచారు. అర్బన్ మార్కెట్ నిర్వహించటానికి మునిసిపల్ కార్పొరేషన్ చేసిన సహకారం మరవలేనిదని డ్వాక్రా మహిళలు తెలిపారు. ప్రభుత్వ సహాయ సబ్సిడీ తాము ఈ వ్యాపారం చేయగలుగుతున్నామని చెబుతున్నారు. ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీని అనుసరించి నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు మహిళలు తెలిపారు.


పొదుపు సంఘాల మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్

పట్టణాల్లో పేదరికాన్ని పారద్రోలడమే లక్ష్యంగా ప్రభుత్వం మెప్మా మిషన్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్వాక్రా వంటి సంఘాలకు ప్రోత్సాహం ఇస్తుందని తెలిపారు.


కల్లంవారిపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రం

చిన్నారుల ఆరోగ్యంపైనే దృష్టి

ప్రజాశక్తి - పంగులూరు

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఆరోగ్యం, చదువుపైనే ఎక్కువ దృష్టి పెట్టి పనిచేస్తున్నామని అంగన్‌వాడి కార్యకర్త మచ్చా ధనలక్ష్మి చెప్పారు. ప్రభుత్వం నుంచి వచ్చే సౌకర్యాలు చిన్నారులకు అందిస్తున్నట్లు తెలిపారు. అక్షరజ్ఞానం నేర్పిస్తున్నామని తెలిపారు. కల్లంవారిపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రజాశక్తి శుక్రవారం సందర్శించింది. అంగన్‌వాడీ కేంద్రంలో 12మంది ప్రీ స్కూల్ పిల్లలు, 17మంది టీహెచ్ఆర్ పిల్లలు, ఆరుగురు గర్భిణీ స్త్రీలు, ముగ్గురు బాలింతలు, 32 మంది కిషోర్ బాలికలు ఉన్నారని తెలిపా. ప్రీస్కూల్ పిల్లలకు బియ్యం, గుడ్లు, పాలు అందిస్తున్నామని తెలిపారు. ఆటలు, చదువుపై దృష్టి పెట్టే విధంగా కృషి చేస్తున్నామని అన్నా రు. గర్భిణీ స్త్రీలు, బాలింతలకు నెలకు ఒకసారి బాల సంజీవని కిట్లు, ఐదు లీటర్ల పాలు, 25గుడ్లు, 3కేజీల బియ్యం, ఒక కేజీ కందిపప్పు, అరకేజీ నూనె ఇస్తున్నట్లు చెప్పారు. కోడిగుడ్లు కేంద్రానికి చేరటం ఆలస్యం అవు తుందని చెప్పారు. పిల్లలకు తెలుగు, ఇంగ్లీష్ మీడియం లో చదువు చెబుతున్నామని తెలిపారు. ఆయా పాలపర్తి చిట్టెమ్మ మాట్లాడుతూ పిల్లలు రకరకాల ఆట బొమ్మలతో ఆడుకుంటూ సంతోషంగా ఉన్నట్లు తెలిపారు.

మహిళా పోలీసులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - చీరాల


అడిషనల్ జనరల్ సెక్రటరీ దాసరి ఆదిలక్ష్మి

కూటమి ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ మహిళా పోలీసుల భవిష్యత్తుపై దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని మహిళా పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అడిషనల్ జనరల్ సెక్రటరీ దాసరి ఆదిలక్ష్మి శుక్రవారం తెలిపారు. ఉన్నత చదువులు చదువుకొని సంబంధం లేని జాబ్ చార్టుతో సతమతం అవుతున్నామని అన్నారు. కోర్టు కేసు కారణం గా జాబ్ చార్ట్, మదర్ డిపార్టెంట్, ప్రమోషన్ ఛానల్ విషయంలో స్పష్టత లేకపోవడం వంటి అంశాల కారణంగా ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు.


ఒంగోలు కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం దృశ్యాలు

రైల్వే ఉద్యోగులకు వైద్య సేవలు

ప్రజాశక్తి - బాపట్ల

ఒంగోలు కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో స్థానిక రైల్వే ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు బాపట్ల రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారంపై శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో కంటి పరీక్షలతోపాటు ఈసీజీ, బీపీ, మధుమేహం, గుండె, కిడ్నీ పరీక్షలు చేశారు. తమ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందిస్తామని తెలిపారు. అనేక ఆరోగ్య సమస్యలతో 200మందికిపైగా పరీక్షలు చేయించుకున్నారు. 76మందికి ఆరోగ్యశ్రీ, ఈసిహెచ్ఎస్ ద్వారా మెరుగైన సేవలు అందిస్తామని కిమ్స్ హాస్పిటల్ యాజమాన్యం తెలిపారు. శిబిరంలో కపిల్ కార్తీకరెడ్డి, పవన్ కుమార్, రామాంజనేయులు, విజయలక్ష్మి, ఐ వెంకటేశ్వర్లురెడ్డి, ఒంగోలు ఎసిఎస్ ఈ వెంకటరమణారావు, తెనాలి డిఎంఒ చైతన్య, బాపట్ల ఎస్ఎంఆర్ కెఎం మీనా, ఎస్‌సిఆర్ఎంయు కార్యదర్శి నరేష్, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కేంద్ర బృంధం

అభివృద్ధిపై కేంద్ర బృందం సమీక్ష

ప్రజాశక్తి - సంతమాగులూరు

ఉపాధి హామీ పథకం నూటికి నూరు శాతం గ్రామీణ పేదలు లబ్ది పొందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కేంద్ర బృందం సభ్యులు సూచించారు. మండలంలోని మక్కెనవారిపాలెం, అడవిపాలెం, వెల్లలచెరువు గ్రామాల్లో సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యుల బృందం పర్యటించి అభివృద్ధి పనులను సమీక్షించారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న జాతీయ పేదరిక నిర్మూలన, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనపై స్వయం సహాయక బృందాలతో అమలవుతున్న పథకాల గురించి సమీక్షించారు. మెరుగైన పని విధానాల గురించి కేంద్ర బృంధం సలహాలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కిరణ్మయి, ఈఓఆర్డి శివరాంప్రసాద్, ఎంఈఓ వి కోటేశ్వరరావు, ఎపిఎం హనుమంతరావు, ఎపిఒ సురేష్, స్వయం సహాయక గ్రూపులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడి సిబ్బంది, పంచాయతీ రాజ్, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.



దెబ్బతిన్న మినుము పరిశీలిస్తున్న ఎఓ సుబ్బారెడ్డి

27 వరకు పంట నష్టం అంచనాలు

ప్రజాశక్తి- పంగులూరు

ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన అధిక వర్షాలకు దెబ్బతిన్న మినుము పంట నష్టాలను ఈనెల 27వరకు అంచనా వేయనున్నట్లు ఎఓ సుబ్బారెడ్డి తెలిపారు. మండలంలోని కొండమూరు, ముప్పవరం గ్రామాల్లో మీనుము పంటను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈనెల 23నుండి మినుము నష్ట పోయిన పొలాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. మినుము కోత దశలో ఉండి అధిక వర్షాలకు 33శాతం కంటే ఎక్కువ నష్టపోయిన రైతులను గుర్తించేందుకు గ్రామ స్థాయిలో విఎఎలు, విఆర్‌ఎలను బృంధంగా ఏర్పాటు చేశామని తెలిపారు. మండల స్థాయిలో ఎఓ, ఆర్ఐ, ఎఎస్ఓను టీంగా, డివిజన్ స్థాయిలో ఆర్‌డిఒ, ఎడిఎ సూపర్వైజింగ్ ఆఫీసర్లుగా నియమించారని అన్నారు. గ్రామ స్థాయిలో పంట నష్టపోయిన పొలాలను 27వరకు పరిశీలించి జాబితా తయారు చేస్తున్నట్లు తెలిపారు. 28నుండి నవంబర్ 2వరకు సామాజిక తనిఖీ కొరకు ప్రభుత్వ కార్యాలయాల దగ్గర జాబితాను ఉంచుతామని చెప్పారు. నవంబర్ 3న ఉన్నతాధికారులకు తుది జాబితా పంపిస్తామని తెలిపారు. పొలాల పరిశీలనలో తెలుగుదేశం నాయకులు ఏడుకొండలు పాల్గొన్నారు.

పంట నమోదు చేయించుకోవాలి

ప్రజాశక్తి - ముండ్లమూరు

రైతులు సాగు చేస్తున్న పంటలకు ఈ క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకుంటేనే నష్టపరిహారం వస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వేంపాడులో ఈ క్రాప్ నమోదు ధ్రువీకరణ పత్రాలు శుక్రవారం పంపిణీ చేశారు. రబీలో సాగు చేసే మొక్కజొన్న, మినుము, మిరప, శనగ, వరి పంటలకు రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం కింద నష్టపరిహారం పొందాలంటే రైతులే ఆ పంటలకు ఇన్సూరెన్స్ చేసుకుంటేనే నష్టపరిహారం వస్తుందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారి శ్రీనివాస్ నాయక్, ఎఓ ఎండి ఫరూక్, విఎఎలు శోభారాణి, బాల వెంకటయ్య పాల్గొన్నారు.

యానిమేటర్ చేతివాటం

రూ.80 లక్షలకు పైగా స్వాహా

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండల సమైక్య కేంద్రం పరిధిలోని భట్టిప్రోలు గ్రామైక్య సంఘం యానిమేటర్‌గా పనిచేస్తున్న మహిళ తన పరిధిలోని డ్వాక్రా గ్రూపుల నుండి సభ్యులకు తెలియకుండా తన సొంత ఖర్చులకు ఫోర్జరీ సంతకాలతో రూ.80లక్షలలకుపైగా స్వాహా చేసిచ్చినట్లు ఆరోపణలు హల్ చల్ చేస్తున్నాయి. గత నాలుగు రోజులుగా గ్రామంలో తీవ్ర చర్చనీయాంశం కావడమే కాక పలువురు బాధితులు పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించారు. గ్రామైక సంఘం యానిమేటర్‌గా పనిచేస్తున్న ఓ మహిళ మూడేళ్ల క్రితం యానిమేటర్‌గా చేరారు. అప్పటి నుండి డబ్బు దాహంతో మహిళల గ్రూపుల నుండి వారికి తెలియకుండానే వారి రికార్డుల్లోని సంతకాలు ఫోర్జరీ చేసుకుని అక్రమాలకు పాల్పడినట్లు వెలుగు చూస్తుంది. ఈపాటికే గ్రామంలో గిరిజన (యానాది) కులానికి చెందిన పలువురు గ్రూపు లీడర్ల సంతకాలు ఫోర్జరీ చేసి ప్రాంసరీ నోట్లను తయారు చేసుకుని వీరు పేరున రూ.లక్షలు మంజూరై ఉన్నాయని, ఆ సొమ్ము రాగానే వారి నుండి ఇప్పిస్తానని గ్రామంలోని ఆమెకు తెలిసిన వారి నుండి ఆ నోటులపై రూ.4లక్షలపైగా సొమ్ము తీసుకొని వ్యక్తిగత ఖర్చులకు వాడుకున్నట్లు చర్చిస్తున్నారు. సొమ్ము ఇచ్చిన వ్యక్తులు సదరు గ్రూపు సభ్యులను తమ సొమ్ము తిరిగి కట్టండని నిలదీయడంతో అసలు విషయం బయటపడింది. దీంతో గిరిజన మహిళలు ఆందోళనకు గురై తాము డబ్బులు తీసుకోవడమేమిటి? తమకు ఇంత సొమ్ము దేనికి? అసలు మీరు ఎవరో తమకు తెలియదంటూ పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించారు. పోలీస్ స్టేషన్లో విచారించగా సదరు యానిమేటరు గ్రూపు సభ్యుల ఫోర్జరీ సంతకాలతో నోటు తానే రాసుకొని బయటి వారిని నమ్మించి డబ్బులు తీసుకున్నట్లు వెల్లడయ్యింది. దీంతో యానిమేటర్ పరిధిలోని గ్రూపు సభ్యులందరూ ఆందోళనకు గురై ఎవరికి వారు మండల సమైక్య కేంద్రం, బ్యాంకుల వద్దకు వెళ్లి వారి గ్రూపులను చెక్ చేసుకుంటున్నారు. అద్దేపల్లి దళితవాడకు చెందిన గాలంకి దిలీప్ అనే మరొక వ్యక్తి భార్య నుండి ఖాళీ చెక్కులపై సంతకాలు చేసి రూ.15లక్షలకుపైగా డబ్బు తీసుకుని దానికి గాను నెలనెలా రూ.30వేలు వడ్డీ చెల్లిస్తున్నట్లు తెలిసింది. డబ్బు ఇచ్చిన వ్యక్తులు డబ్బు తిరిగి కట్టాలని గట్టిగా నిలదీయడంతో మీరెవరో తమకు తెలియదంటూ ఎదురు తిరగడంతో పాటు డబ్బులు ఇచ్చిన వ్యక్తి గట్టిగా మాట్లాడగా అతనిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించినట్లు చెప్పాడు. ఈ కేసు భట్టిప్రోలు ఎస్ఐ, వేమురు సిఐ, రేపల్లె డిఎస్పి పరిధిలో పరిశీలన జరుగుతున్నట్లు తెలిసింది. అనూష అనే యానిమేటర్‌కు బట్టల దుకాణం, జనరల్ స్టోర్ నిర్వహిస్తూ ఉండటంతో డబ్బులు ఎక్కడకు పోతాయనే దృకృథంతో ఇంత సొమ్ము ఇచ్చామని, తీరా డబ్బులు కావాలని అడిగినందుకు తమపై అక్రమ కేసులు బనాయించేందుకు ప్రయత్నించినట్లు దిలీప్ వాపోయాడు. గత వైసిపి పాలనలో యానిమేటర్‌గా చేరిన అనూష అధికార పార్టీని అడ్డం పెట్టుకొని గ్రామంలో గ్రామైక సంఘంలో అనేక అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. విషయంపై ఎపిఎం శ్రీమన్నారాయణ మాట్లాడుతూ యానిమేటర్ అనూష విషయంలో పలువురు సభ్యులు వచ్చి ఎకౌంట్లోను పరిశీలించుకున్న మాట వాస్తవమే అన్నారు. తన పరిధిలోని గ్రూపులన్నిటిని క్రాస్ చెక్ చేస్తున్నట్లు వివరించారు. ఎస్ఐ శివయ్య మాట్లాడుతూ ఈ కేసుకు సంబంధించి తనకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ఎవరైనా ఫిర్యాదు చేస్తే పరిశీలన జరుపుతామని అన్నారు. గిరిజన మహిళల పేరుతో నోటు రాసి వేరే చోట డబ్బులు తీసుకున్నట్లు తన దృష్టికి వచ్చిందని అన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు



గ్రామ సభలో యద్దనపూడి ఆర్ఐ విష్ణు

ప్రజాశక్తి - యద్దనపూడి

గ్రామాల్లో భూమి సమస్యలు పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తుందని ఆర్ఐ విష్ణు అన్నారు. మండలంలోని జాగార్లమూడి గ్రామంలో శుక్రవారం రీ సర్వే గ్రామ సభ నిర్వహించారు. రైతులు తమ భూములకు సంబంధిచి ఏమైనా సమస్యలు ఉంటే అర్జీ ఇచ్చి పరిష్కరించుకోవచ్చని అన్నారు. గ్రామ సభలో 29అర్జీలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు వెంకట స్వామి పాల్గొన్నారు.

కొల్లూరు : మండలంలోని దోనేపూడి గ్రామంలో తహశీల్దారు బి వెంకటేశ్వర్లు అధ్యక్షతన శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. సభలో రైతుల నుండి 64 అర్జీలు అందినట్లు తెలిపారు. సమావేశంలో డిప్యూటీ తహసిల్దార్ ఎన్ శ్రీనివాసరావు, మండల సర్వేయర్ హర్షవర్ధన్, రైతులు పాల్గొన్నారు

ముండ్లమూరు : భూముల రీ సర్వే సమస్యల పరిష్కారానికి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఇన్చార్జి తహశీల్దారు శ్రీకాంత్ అన్నారు. మండలంలోని భట్లపల్లి గ్రామంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామ సభలో వచ్చిన తొమ్మిది అర్జీలను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహశీల్దారు ఎ స్రవంతి, మండల సర్వేయర్ కాటమరాజు, విఆర్ఓ ఐ సుజాత, గ్రామ సర్వేయర్ సావిత్రి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొల్లూరు తహశీల్దారు బి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న ముండ్లమూరు తహశీల్దారు శ్రీకాంత్

పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లు

ప్రజాశక్తి - చెరుకుపల్లి

నవంబర్ 1న ఎన్‌టిఆర్ బరోసా పెన్షన్ పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నామని ఎంపిడిఒ షేక్ మహబూబ్ సుభాని తెలిపారు. 175 మంది సిబ్బందిచే 283 క్లస్టర్లకు సంబంధించిన పెన్షన్ లబ్దిదారులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఉద్యోగికి 100 పెన్షన్లకు మించకుండా కేటాయించినట్లు తెలిపారు. 16 పంచాయతీల్లో పర్యవేక్షణకు 8మంది అధికారులను నియమించినట్లు తెలిపారు. అధికారుల బదిలీలను దృష్టిలో ఉంచుకొని పెన్షన్ల పంపిణీలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

నేడు టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - వేమూరు

తెలుగుదేశం సభ్యత్వం నమోదు కార్యక్రమం శనివారం స్థానిక తెలుగుదేశం కార్యాలయంలో శాసన సభ్యులు నక్కా ఆనంద్ బాబు ప్రారంభిస్తారని ఆయన క్యాంపు కార్యాలయ సిబ్బంది తెలిపారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని కోరారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రఘు నందన్

ఆరోగ్య శ్రీ ద్వారా కేన్సర్ వైద్యం

ప్రజాశక్తి - చీరాల

స్థానిక ప్రభుత్వ వైద్యశాల్లో ఒంగోలుకు చెందిన హెచ్‌సిజిఎంఎన్‌ఆర్ క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాన్సర్ వైద్యనిపుణులు డాక్టర్ ఆర్‌వి రఘునందన్ మాట్లాడుతూ ప్రతినెలా 4వ శుక్రవారం చీరాల ప్రభుత్వ వైద్యశాల్లో ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా క్యాన్సర్ చికిత్సకు వైద్యం చేస్తున్నట్లు తెలిపారు. చీరాల పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఏక్సిక్యూటివ్ శరత్ కుమార్ పాల్గొన్నారు.

మాజీ పంచాయతీ మెంబర్ మృతి

ప్రజాశక్తి - ఇంకొల్లు



ఏజర్ల మోషే (76)

ఇంకొల్లు పంచాయితీ మాజీ సభ్యులు, మార్కెట్ యార్డు హమాలీ మేస్త్రి ఏజర్ల మోషే (76) శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందారు. స్థానిక స్టాలిన్ పేటకు చెందిన మోషే గతంలో కాంగ్రెస్ నాయకునిగా గుర్తింపు పొందాడు. పంచాయతీ ఎన్నికల్లో రెండు పర్యాయాలు పోటీ చేసి హరిజనవాడ వార్డు సభ్యునిగా గెలిచాడు. ఆయన మార్కెట్ యార్డులో గుర్తింపు పొందిన హమాలీగా సుదీర్ఘకాలం పనిచేశాడు. స్థానికంగా మిరప తోటలు, పొగాకు తోటలో నాటుకు మేస్త్రీగా పనిచేస్తున్నాడు. హమాలీ పనితోపాటు స్థానికంగా ప్రత్తి, పొగాకు, మిరప కమిషన్ వ్యాపారం చేస్తూ ఉంటాడు. మొదటి నుంచి కాంగ్రెస్‌లో కొనసాగిన మోసే వైసిపి స్థాపించిన అనంతరం వైసిపి నాయకుడిగా ఉన్నాడు. మోషేకు భార్య, ఇరువురు కుమారులు, కుమార్తెలు ఉన్నారు.

మద్యం దుకాణం ఏర్పాటు పట్ల ఆందోళన

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండల కేంద్రమైన భట్టిప్రోలులో మరో మద్యం దుకాణం శుక్రవారం ప్రారంభమైంది. స్థానిక బస్టాండ్ సెంటర్లో ఏర్పాటు చేసిన మద్యం దుకాణంతో పాఠశాల, దేవాలయం ఉండటమే కాక నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో మందు బాబులు మద్యం సేవించి వీరంగం సృష్టిస్తున్నారని, తక్షణమే ఈ దుకాణాన్ని వేరే ప్రాంతానికి మార్చాలని డిమాండ్ వ్యక్తం అవుతుంది. ఈ బస్టాండ్ సెంటర్లో ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంటుంది. అలాంటి సమయంలో మందు బాబులు మద్యం మత్తులో ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడతారోనని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. మందుబాబులను చూసి కొంత మంది విద్యార్థులు వాటికి ఆకర్షితులయ్యే పరిస్థితులు ఉంటాయని, తక్షణమే దీనిని వేరే ప్రాంతానికి తరలించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తహశీల్దారుకు వినతి పత్రం అందజేశారు. ఇలాంటి క్రమంలో భట్టిప్రోలు, వెల్లటూరు రోడ్డులో కళ్యాణి వైన్స్ పేరుతో మరో మద్యం షాపు వెలసింది.

నేడు పల్లపట్లలో గ్రామసభ

ప్రజాశక్తి - నిజాంపట్నం

మండలంలోని పల్లపట్లలో భూముల రీ సర్వేపై శనివారం గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహశీల్దారు షాకీర్ పాషా తెలిపారు. గత ప్రభుత్వంలో చేసిన భూముల రీ సర్వేలో ఏమైనా అభ్యంతరాలు సభలో అర్జీ రూపంలో తెలియజేస్తే పరిష్కరిస్తామని చెప్పారు. రైతులందరూ తమ సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు.

రేపు చీమకుర్తిలో జిల్లాస్థాయి చెకుముకి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ సహకారంతో ఈ నెల 27న ఆదివారం ఉదయం 9 గంటలకు జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు చీమకుర్తిలోని చీమకుర్తి పబ్లిక్ స్కూల్ (సి.పి.యస్)లో ప్రారంభం కానున్నాయని జనవిజ్ఞానవేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మండ్లా శ్రీనివాసులు, సి. హెచ్.జయప్రకాశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా అక్టోబర్ ఒకటిన జరిగిన మండలస్థాయి చెకుముకి సైన్స్ పరీక్షలలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల విభాగాలలో మొదటి స్థానం సాధించిన ఉన్నత పాఠశాలల విద్యార్థి బందాలు ఈ జిల్లా స్థాయి చెకుముకి సంబరాలకు హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 9440522775, 9849868311ను సంప్రదించాలని కోరారు. విద్యాశాఖాధికారులతో పాటు డాక్టర్లు, జిల్లా జెవివి సీనియర్ నాయకులు, సైన్స్ ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారని వారు తెలిపారు. విద్యార్థులకు చిన్ననాటి నుండే మూఢనమ్మకాల పట్ల అవగాహన కల్పించి వాటిని నిర్మూలించేందుకు, విద్యార్థులలో దాగి ఉన్న సజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు, ప్రశ్నించే తత్వాన్ని,సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు గత 34 సంవత్సరాలుగా ప్రతిఏటా చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం జెవివి చేస్తున్న కషిలో భాగంగా నిర్వహిస్తున్న ఈ చెకుముకి సైన్సు సంబరాలను జయప్రదం చేయాలని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సైన్స్ అభిమానులు, విద్యార్థుల తల్లిదండ్రులను శ్రీనివాసులు, జయప్రకాష్ కోరారు.



మాట్లాడుతున్న జేసీ ప్రఖర్‌జైన్

మాతృమరణాలను అరికట్టడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి..

జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మాతృ మరణాలను అరికట్టడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్‌జైన్ తెలిపారు. మాతృమరణాలపై సంబంధిత వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లో సమావేశం జరిగింది. బాపట్ల జిల్లాలో మాత మరణాలు అరికట్టడానికి అధికారులంతా సమన్వయంతో కషి చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ చెప్పారు. గత మూడు నెలలుగా జిల్లాలో ఏడు మాత మరణాలు నమోదు కావడంపై క్షుణ్ణంగా ఆరా తీశారు. మరణాలకు కారణాలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. రక్తహీనత నివారణతోనే మాత మరణాలు పూర్తిస్థాయిలో అరికట్టవచ్చన్నారు. మహిళలు గర్భిణులు కాగానే దస్త్రాలలో నమోదు చేయాలన్నారు. గర్భిణులపై ప్రత్యేక దష్టి సారించాలన్నారు. గర్భిణులకు రక్తహీనత ఉంటే ముందుగానే గుర్తించి మెరుగైన వైద్యం అందించాలన్నారు. అలాంటి వారికి ప్రణాళికాబద్ధంగా ముందస్తుగానే పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. వైద్యం అందించడంలో లోపాలను సవరించుకోవాలని ఆయన చెప్పారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ, డిసిహెచ్ఎస్ శేషుబాబు, డాక్టర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఏలూరి' ప్రజాదర్బార్‌కు విశేష స్పందన

- ప్రజల కష్టాలు తీర్చడమే ప్రభుత్వ లక్ష్యం - ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నిర్వహించిన ప్రజాదర్బార్‌కు విశేష స్పందన లభించింది. శుక్రవారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో 'పర్చూరు ప్రజాదర్బార్'ను నిర్వహించారు. ఉదయం 9 గంటలకే ప్రజలు పెద్ద ఎత్తున క్యాంపు కార్యాలయం చేరుకున్నారు. ప్రత్యేక కౌంటర్ల ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఆయా గ్రామాల నుంచి వచ్చిన ప్రజలతో మమేకమై ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్వయంగా అర్జీలు స్వీకరించారు. పలు సమస్యలను సంబంధిత శాఖల అధికారులతో ఆయా సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. అక్కడికక్కడే కొన్ని సమస్యలను ఏలూరి పరిష్కరించారు. పలు సమస్యలను యుద్ధప్రాతిపాదికన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రధానంగా రెవిన్యూ, రహదారులు, పెన్షన్లు, ఇళ్ల స్థలాలు, మంచినీటి సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చొరవ చూపాలని అధికారులకు సూచించారు. రెవిన్యూ, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, ఆర్ డబ్ల్యు ఎస్, ట్రాన్స్ కో, హార్టికల్చర్, అగ్రికల్చర్‌లోని వివిధ శాఖల అధికారుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో గత ఐదేళ్ల అనేక సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. కూటమి ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. ప్రజలు ఎదుర్కొన్న అనేక సమస్యలను పరిష్కరించి వంద రోజుల్లోనే ప్రజాభిమానాన్ని చూరగొన్నామన్నారు. ప్రజల ఆకాంక్షలు కనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివద్ధి చేసేందుకు కషి చేస్తానన్నారు. అవకాశాలను అందిపుచ్చుకొని అభివద్ధి కోసం పాటుపడుతామన్నారు. భవిష్యత్తులో నియోజకవర్గాన్ని పారిశ్రామిక ప్రాంతంగా మారుస్తామన్నారు. పరిశ్రమలకు నియోజకవర్గ అనుకూలంగా ఉందని వ్యవసాయ రంగంతోపాటు పారిశ్రామిక రంగంలో అభివద్ధిని పరుగులు పెట్టిస్తామన్నారు. చినగంజాం మండలం, మోటుపల్లి సముద్ర మార్గ రవాణాకు అనుకూలమని కేంద్ర ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లామని మోటుపల్లి సముద్ర తీరాన్ని త్వరలో అధికారులు వచ్చి పరిశీలిస్తారన్నారు. సముద్రం రవాణా ద్వారా మోటుపల్లి ప్రాంతం అన్ని రకాల అభివద్ధి చెందుతుందన్నారు. పెట్టుబడి తీసుకువచ్చి అభివద్ధి చేస్తామని, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం కోసం నిరంతరం ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అధికారులు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో పర్చూరు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతానన్నారు. ప్రజల కష్టాలను తీర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అభివద్ధి సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రజలందరూ సుభిక్షంగా ఉండేందుకు ప్రభుత్వం అన్ని కార్యక్రమాలను అమలు దిశగా అడుగులు వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గ్లోరియా ఆరు మండలాల తాసిల్దార్లు, మండల పరిషత్ అభివద్ధి అధికారులు, పీ ఆర్, ఆర్ అండ్ బి , ఆర్డబ్ల్యూఎస్, ట్రాన్స్కో, డీఈ లు,ఏఈలు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కింద కూర్చొని ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఏలూరి



బాలుడి సమస్య తెలుసుకుంటున్న ఏలూరి

తెగేంత వరకు లాగొద్దు..

- కార్మికుల కోసం ఎందాకైనా పోరాడతాం

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ డిమాండ్

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపాలిటీలో అధికారులు అధికార పార్టీ ఒత్తిడికి తలొగ్గి పనిచేస్తున్నారని, అందులో భాగంగా ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న 21 మంది కాంట్రాక్ట్ కార్మికులను అక్రమంగా తొలగించారని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ ఆరోపించారు. పది రోజులకు పైగా కార్మికులు ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. తెగేంత వరకు లాగొద్దని హితవు పలికారు. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 11వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలను ఎంపిజె రాష్ట్ర అధ్యక్షులు షేక్ అబ్దుల్ రజాక్ ప్రారంభించగా ముఖ్య అతిథిగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిరువురూ కార్మికులకు మద్దతుగా మాట్లాడారు. కార్మికుల కోసం ఎందాకైనా పోరాడుతామన్నారు. తక్షణమే కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాతికేళ్లుగా పనిచేస్తూ... ఇంజనీరింగ్ విభాగంలో అనుభవం గడించిన కార్మికులను అక్రమంగా తొలగించారన్నారు. తొలగించిన కార్మికుల కుటుంబాలు వీధినపడ్డాయన్నారు. పాలనలో ఎవరున్నా ఉపాధి కల్పిస్తారే గానీ... ఉపాధి ఊడగొట్టే వారిని ఇక్కడే చూస్తున్నామని వాపోయారు. తొలగింపబడిన కార్మికుల కుటుంబాల్లో ఆర్థిక ఇబ్బందులు మున్సిపల్ అధికారులకు, కూటమి నేతలకు అర్థం కావడం లేదన్నారు. అధికారుల్లో, కూటమి నేతల్లో మార్పు రాకపోతే రాష్ట్ర స్థాయిలో మార్కాపురం అంశాన్ని చర్చిస్తామన్నారు. ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. అవసరమైతే ఈ విషయాన్ని, ఇక్కడ జరిగే అక్రమాలను సిఎం చంద్రబాబు వద్దకు తీసుకెళతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం రఫి, ఎంపిజె జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాశిం, పట్టణ అధ్యక్షుడు షేక్ నాగూర్ మీరావలి, ఉపాధ్యక్షులు సయ్యద్ వలి, షేక్ అబ్బాస్, మాజీ అధ్యక్షుడు షేక్ అమీర్, ఖాసింషా, మున్సిపల్ నాయకులు కె.సుబ్బరాయుడు, జి హరి, షేక్ ఇమాంషా, కనకయ్య, రమణ, యూసఫ్, బత్తుల సుబ్బారెడ్డి, ఎస్.కె షబ్బీర్, నాసరయ్య, అబ్దుల్ సలాం, పి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేష్

నీటి సంరక్షణ కార్యక్రమాలు చేపట్టండి

- భూగర్భ జలాలు పెరిగేలా చర్యలు

- వాటర్ బడ్జెట్ ప్లాన్ రూపొందించండి

- అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములు చేసి నీటి సంరక్షణ కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ మీకోసం సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా నీటి యాజమాన్యం సంస్థ ఆధ్వర్యంలో భూగర్భ జలాల పెంపుకు చేపట్టాల్సిన నీటి సంరక్షణ చర్యలపై ఎంపి డిఓలు, ఈఓ పిఆర్‌డిలు, ఎపిఓలు, ఎపిఎమ్‌లు, ఆర్ డబ్ల్యూఎస్. ఇంజనీరింగ్ అధికారులతో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా అంటే నీటి సమస్య జిల్లాగా గుర్తుకు వస్తుందని, ఆ అభిప్రాయాన్ని మార్చేలా నీటి సంరక్షణ కార్యక్రమాలు పెద్దఎత్తున చేపట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జిల్లాలో మొత్తం 57 గ్రామాలలో పరిమితికి మించి భూగర్భజలాలను వినియోగించినట్లు గుర్తించామన్నారు. వీటిలోని కొన్ని గ్రామాల్లో రిలయన్స్ ఫౌండేషన్, సార్డ్స్, ఎఫర్డ్ సంస్థలు ఇప్పటికే అధ్యయనం చేసి వాటర్ బడ్జెట్ ప్రణాళికను రూపొందించాయని తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామా పంచాయతీల్లో ఎంత నీరు అందుబాటులో వుంది, ఎంత నీటిని వినియోగించడం జరుగుతుంది, ఎంత నీటి అవసరం ఉంది వంటి విషయాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి విలేజ్ వాటర్ బడ్జెట్ ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 33 వేల ఇంకుడు గుంతల నిర్మాణాలకు అనుమతి ఇచ్చామని మండలానికి 1000 ఇంకుడు గుంతలు నిర్మించేలా లక్ష్యాన్ని నిర్దేశించామన్నారు. ఒకే రోజున జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో నమూనా ఇంకుడు గుంత నిర్మాణం చేపట్టి అ గ్రామా ప్రజలకు నీటి సంరక్షణ ఆవశ్యకత, ఇంకుడు గుంత ప్రయోజనాలను తెలియ చేసేలా ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్, అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రూపొందించిన జిల్లా, విలేజ్ వాటర్ బడ్జెట్ ప్రణాళికపై రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి వెంకట బాబు రావు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఇంకుడు గుంతల నిర్మాణాలు, రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు, ఫారంపాండ్ నిర్మాణాలు, క్యాటిల్ షెడ్స్ నిర్మాణాలపై డ్వామా ఇంజనీరింగ్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో జడ్పీ సిఇఓ బి.చిరంజీవి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డాక్టర్ ఎస్. శ్రీనివాస రావు, డిఆర్‌డిఎ, మెప్మా, ఏపిఎంఐపి పీడీలు టి.వసుంధర, టి. రవికుమార్, పివి రమణ, ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కె.ంకటేశ్వర రావు, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, ఆర్ డబ్ల్యూ ఎస్ ఇంజనీరింగ్ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా